సూపర్ పోలీస్..!

రూ.1.73 కోట్లు కొట్టేసిన సైబర్ నేరగాళ్లు

వేటాడి పట్టుకొచ్చిన అనంత పోలీసులు



స్వాధీనం చేసుకున్న నగదు, సెల్‌ఫోన్‌లు, పాస్‌బుక్‌లను పరిశీలిస్తున్న ఎస్పీ

కాంబోడియా నకిలీ యాప్స్‌తో సైబర్ నేరాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠాను జిల్లా పోలీసులు పట్టుకున్నారు. రాయదుర్గం మండలం వేపరాళ్లకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ నరసింహప్పను మాయ చేసి.. రూ.1.73 కోట్లు కొట్టేసిన కేటుగాళ్లను లాక్కొచ్చి జైల్లోకి నెట్టారు. ఈ ముఠాను పట్టుకునేందుకు పోలీసులు నెల రోజులు శ్రమించారు. కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు ఆధ్వర్యంలో సీఐలు జయనాయక్, వెంకటరమణ, షేక్ జాకీర్, పలువురు ఎస్ఐలు ప్రత్యేక బృందంగా ఏర్పడి, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్ తదితర ప్రాంతాల్లో గాలించారు. ఐదుగురిని అరెస్టుచేసి, రూ.41.20 లక్షల నగదు, కారు, ఏటీఎం కార్డులు, సిమ్‌కార్డులు, సెల్‌ఫోన్లు, బ్యాంక్ పాసుపుస్తకాలు, చెక్‌బుక్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు వివరాలను ఎస్పీ జగదీష్ శుక్రవారం వెల్లడించారు.

(వివరాలు మెయిన్‌లో)


నిందితులను మీడియా ఎదుటకు తెస్తున్న పోలీసులు

పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్‌పై సమావేశం



అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పోలింగ్‌స్టేషన్ల రేషనలైజేషన్ (హేతుబద్ధీకరణ) ప్రక్రియ జరిగినట్లు డీఆర్‌ఓ మలోల తెలిపారు. కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ మాట్లాడుతూ గతంలోనే నియోజకవర్గ స్థాయిలో ఎన్నికల రిటర్నింగ్ అధికారుల ఆధ్వర్యంలో గుర్తింపు పార్టీల ప్రతి నిధులతో హేతుబద్ధీకరణపై చర్చించినట్లు తెలిపారు. గతంలో 2226 పోలింగ్ స్టేషన్లు ఉండగా నూతనంగా 330 ఏర్పాటు చేయడంతో మొత్తం 2,556 పోలింగ్ స్టేషన్లను రేషనలైజేషన్ చేసినట్లు డీఆర్‌ఓ తెలిపారు. సమావేశంలో డీఆర్‌ఓ కేశవనాయుడు, అధికారులు పాల్గొన్నారు.

చౌకబారు విమర్శలు మానుకోండి

- హరీష్‌రావుపై విప్ కాలవ మండిపాటు


మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కాలవ

రాయదుర్గం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): చౌకబారు విమర్శలు చేసి దిగజారవద్దని టీఆర్ఎస్ నాయకుడు హరీష్‌రావుపై ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు మండిపడ్డారు. శుక్రవారం ఆయన మార్కెట్‌యార్డ్ కమిటీ హాలులో విలేకరులతో మాట్లాడుతూ.. నారా లోకేష్ పై హరీష్‌రావు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. సముద్రంలోకి వృథాగా వెళ్లే జలాలను బెనకచర్లకు తరలిస్తే తెలంగాణకు అభ్యంతరం ఎందుకు ఉండాలని నారా లోకేష్ అడిగారని అన్నారు. దీనిపై బీఆర్ఎస్ నాయకుడు, మాజీ మంత్రి హరీష్‌రావు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని అన్నారు. తెలంగాణలో సాగునీటి ప్రాజెక్టులకు అంకురార్పణ చేసింది చంద్రబాబే అన్నారు. గోదావరి జలాలను వాడుకునేందుకు రేవంత్‌రెడ్డితో కలిసి ఆంధ్రరాష్ట్రం కుట్రలు పన్నుతోందని చెప్పడం తనస్థాయిని దిగజార్చుకోవడమే అన్నారు. టీడీపీ పుట్టిన తెలంగాణ గడ్డకు ఎలాంటి విఘాతం కలగదని అన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం బీఆర్ఎస్ నాయకులు అవాకులు, చవాకులు పేలుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడువేల టీఎంసీల నీరు సముద్రం పాలవుతోందని, వాటిలో కొంత నీటిని సద్వినియోగం చేసుకుని అత్యంత దుర్భిక్షమైన రాయలసీమ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయడానికి చంద్రబాబు తపన పడుతున్నారని అన్నారు.

నిత్యావసర సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలి

- ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణ శర్మ


రేషన్ షాపును పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణ శర్మ

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): రేషన్ షాపుల ద్వారా నిత్యావసర సరుకుల పంపిణీ సక్రమంగా చేపట్టాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణ శర్మ ఆదేశించారు. శుక్రవారం నగరంలోని నవోదయ కాలనీలోని ప్రభుత్వ చౌకధాన్యపు దుకాణంలో నిత్యావసర సరుకుల పంపిణీని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సరుకుల పంపిణీ పకడ్బందీగా చేపట్టాలన్నారు. రేషన్ షాపుల ముందు పట్టికలో ధరల వివరాలు రాయాలని, స్టాక్‌ను ప్రదర్శించాలని ఆదేశించారు. ఆయనతో పాటు తహసీల్దార్ హరికుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ సజావుగా పూర్తి చేయాలి

ఎన్టీఆర్ భరోసా పథకం కింద పింఛన్ల పంపిణీ సజావుగా పూర్తి చేయాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణ శర్మ ఆదేశించారు. శుక్రవారం నగరంలోని నవోదయకాలనీలో లబ్ధిదారుల ఇంటి వద్దకువెళ్లి ఆయన పింఛన్లు పంపిణీ చేశారు. లబ్ధిదారులతో మాట్లాడారు. సమస్యలు ఏవైనా ఉంటే తెలపాలని, ప్రభుత్వం నుంచి ఏదైనా సహాయం అవసరమైతే చేస్తామని అన్నారు. కార్యక్రమంలో నగరపాలిక డిప్యూటీ కమిషనర్ పావని, తహసీల్దార్ హరికుమార్ పాల్గొన్నారు.

తొలి రోజు 95.17 శాతం పంపిణీ

అనంతపురం అర్బన్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో శుక్రవారం తొలి రోజు 95.17 శాతం పింఛన్ల సొమ్మును లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి సచివాలయ సిబ్బంది పంపిణీ చేశారు. ఈ నెలకు సంబంధించి జిల్లాకు 2,80,811 మంది పింఛన్‌దారులకు రూ.125 కోట్లు విడుదల చేశారు. తొలిరోజు శుక్రవారం సాయంత్రం 6 గంటల దాకా 2,67,257 మందికి రూ.118.47 కోట్ల (95.17 శాతం)పింఛన్ సొమ్మును పంపిణీ చేసినట్లు డీఆర్‌డీఏ పీడీ శైలజ పేర్కొన్నారు.

తల్లిపాలే బిడ్డకు అమృతం

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవి


మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవి

అనంతపురం వైద్యం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): తల్లిపాలే బిడ్డ ఆరోగ్యానికి అమృతమని, ప్రతి మూడు గంటలకు ఒకసారి బిడ్డకు కడుపు నిండా పాలు తాపాలని డీఎంహెచ్‌ఓ ఈబీ దేవి పేర్కొన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను శుక్రవారం నిర్వహించారు. ప్రభుత్వ సర్వజన వైద్యశాల చిన్నపిల్లల వార్డులో విభాగాధిపతి డాక్టర్ రవికుమార్ అధ్యక్షతన తల్లులకు అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, డీఎంహెచ్‌ఓ హాజరయ్యారు.

ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ పురిటి బిడ్డల నుంచి 18నెలల వయసు వచ్చేవరకు తల్లిపాలు ఇవ్వాలన్నారు. బిడ్డకు ఎంతబాగా పాలుపడితే తల్లి అంత ఆరోగ్యంగా ఉంటుందని వివరించారు. వారం రోజులపాటు తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో డీఐఓ డాక్టర్ యుగంధర్, ఆసుపత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం, కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ మధుసూదన్, గైనకాలజిస్ట్ డాక్టర్లు సుచిత్ర, శ్రీలక్ష్మి, చిన్నపిల్లల వైద్యులు శ్రీనివాసులు, ప్రవీణ్‌దీన్ తదితరులు పాల్గొన్నారు.

శ్రమించి.. సాధించారు

- కానిస్టేబుల్ ఉద్యోగాలకు 307 మంది ఎంపిక
- ఒకే కుటుంబంలో ఇద్దరు, ముగ్గురికి ఉద్యోగాలు
- ఉమ్మడి జిల్లాలో 310 పోస్టులకు నోటిఫికేషన్
- మూడేళ్లు సాగిన ఉద్యోగ నియామక ప్రక్రియ

అనంతపురం క్రైం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఎన్నాళ్లగానో ఎదురు చూస్తున్న ప్రభుత్వ ఉద్యోగం కల సాకారమైంది. తల్లిదండ్రులు కష్టపడి చదివించినందుకు ఫలితం దక్కింది. అమ్మానాన్న ఆశలను ప్రభుత్వ ఉద్యోగం సాధించి బిడ్డలు నెరవేర్చారు. శుక్రవారం విడుదలైన సివిల్ కానిస్టేబుల్ పరీక్ష ఫలితాల్లో ఉమ్మడి జిల్లాలో పలువురు యువతీ, యువకులు మంచి మార్కులు సాధించి ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఇందులో ఒకే కుటుంబం నుంచి ఇద్దరు, ముగ్గురు కూడా ఉన్నారు. దీంతో ఆయా కుటుంబాల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 310 పోస్టులకుగాను 307 మంది ఎంపిక య్యారు.

మూడేళ్ల కిందట నోటిఫికేషన్...

పోలీస్ కానిస్టేబుల్ పోస్టులకు ప్రభుత్వం 2022లో నోటిఫికేషన్ ఇచ్చింది. రాష్ట్రంలో 6100 పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వగా అనంతపురం ఉమ్మడి జిల్లాకు సివిల్ కానిస్టేబుల్ పోస్టులు 310 కేటాయించారు. 2023లో ప్రిలిమినరీ పరీక్షలు నిర్వహించారు. తర్వాత హంగార్డులు

(మిగతా 4లో..)


కానిస్టేబుల్‌గా ఎంపికైన ముగ్గురు సోదరులు

ముగ్గురు మొనగాళ్లు

హెడ్‌కానిస్టేబుల్ ముగ్గురు కొడుకులకు ఒకేసారి

గుత్తి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఆ అన్నదమ్ములు ముగ్గురూ ఒకేసారి పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికై చరిత్ర సృష్టించారు. వారే గుత్తి జెండా వీధిలో నివాసముంటున్న ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ మహబూబ్ దౌలా కుమారులు. మహబూబ్ దౌలా ఉద్యోగరీత్యా అనంతపురంలో స్థిరపడ్డారు. ఈయనకు మహమ్మద్ అలీ, మహమ్మద్ గౌస్, మహమ్మద్ సమీర్ అనే ముగ్గురు కొడుకులు ఉన్నారు. చిన్నప్పటి నుంచి తండ్రి స్ఫూర్తితో పెరిగిన వీరు పోలీసు కొలువు సాధించాలని కలలుగన్నారు. ఆ క్రమంలోనే పట్టుదలగా విద్యాభ్యాసం చేసి కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ముగ్గురు కుమారులు ఒకే సారి కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించడంతో మహబూబ్ దౌలా ఆనందానికి అవధులు లేకుండాపోయాయి. బంధువులు, స్నేహితులు ముగ్గురు యువకులను ప్రశంసల్లో ముంచెత్తారు.

కూలీల కొడుకులకు పోలీస్ కొలువులు


అన్నదమ్ములు హసన్‌వలి, జిలాన్‌బాషా

పెద్దవడుగూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని రావులుడికి గ్రామానికి చెందిన అన్నదమ్ములు హసిన్‌వలి, జిలాన్‌బాషా కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరి తల్లి హాజీబీ, తండ్రి ఇమాంవలి. కూలి పనులకు వెళితే గాని పూట గడవని ఈ కుటుంబం నుంచి ఇద్దరు కుమారులు ఒకే సారి కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికవడంతో వారి సంతోషానికి హద్దులేకుండా పోయింది. ఇద్దరికి ఉద్యోగాలు రావడంతో ఇంజనీరింగ్ చదువుతున్న మరో కుమారుడి చదువు ఇబ్బంది లేకుండా సాగుతుందని ఆ తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కళామతల్లి ముద్దుబిడ్డ రాఘవ
- నేడు బళ్లారి రాఘవ 145వ జయంతి
- నలుగురికి రాఘవ అవార్డులు

4

లెక్కే లెక్క...!

అక్రమార్జనలో చెలరేగిపోతున్న సబ్ రిజిస్ట్రార్లు

- ప్రతి డాక్యుమెంట్‌కూ రూ.2వేలు తప్పనిసరి
- వివాదాల భూముల్లో పిండుకున్నంత
- నెల వారి మామూళ్లతో ఉన్నతాధికారుల ఉదాశీనత



అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): కొన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారాయి. ఇక్కడ పనిచేసే ప్రైవేట్ ఉద్యోగుల నుంచి సబ్‌రిజిస్ట్రార్ల వరకు అందరికీ ప్రతి రోజూ ఆదాయమే. ఉమ్మడి జిల్లాలో 21 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. ప్రతి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో నిత్యం అవినీతి బాగోతమే. కొందరు సబ్ రిజిస్ట్రార్లు నెల వారిగా టార్గెట్ పెట్టుకుని వసూళ్లకు పాల్పడు తున్నట్లు సమాచారం. ఇటీవల కళ్యాణదుర్గం ఇన్‌చార్జ్ సబ్‌రిజిస్ట్రార్ నారాయణస్వామి రూ.5లక్షలు తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఉన్నతాధికారులకు సైతం నెల వారి మామూళ్లు ముడుతుండటంతో చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. పోస్టింగుల విషయంలోనూ ఉదాశీనత ప్రదర్శిస్తుండటమే ఇందుకు నిదర్శనం.

అడ్డూ అదుపులేని ఆదాయం

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అక్రమ ఆదాయానికి అడ్డూ అదుపులేదనే విమర్శలు వినవస్తున్నాయి. సాధారణంగా ప్రతి సబ్‌రిజిస్ట్రార్ కార్యాల యంలో రిజిస్ట్రేషన్ జరిగే ప్రతి డాక్యుమెంట్‌కు రూ.2వేలు తీసుకుంటారు. ఇది డాక్యుమెంట్ రైటర్లు లేదా బ్రోకర్ల నుంచి నేరుగా సబ్ రిజిస్ట్రార్‌కు వెళ్తుంది. ఇదంతా (మిగతా 4వ పేజీలో...)

పోయినోళ్లకు ఉపాధి బిల్లులు

54 మంది మృతుల పేరిట జాబ్ కార్డులు, బిల్లులు

ఉపాధి సిబ్బంది, వైసీపీ నాయకుల కుమ్మక్కు

బీకేఎస్ మండలంలో రూ.2 కోట్లకు పైగా స్వాహా


దయ్యాలకుంటపల్లిలో విచారిస్తున్న ఏపీడీ చెన్నకేశవులు

> దయ్యాలకుంటపల్లి.. బుక్కరాయసముద్రం మండలంలోని ఓ చిన్న గ్రామం.. ఊరి పేరుకు తగ్గట్టుగానే ఆ గ్రామంలో జరిగిన ఉపాధి హామీ పథకంలో దయ్యాలు పనిచేశాయి. 54 మంది చనిపోయిన వ్యక్తుల పేరుతో జాబ్ కార్డులు సృష్టించారు. వారు పనిచేసినట్లు, ఆ మేరకు నగదు డ్రా చేసుకున్నట్లు తాజా విచారణలో వెలుగులోకి వచ్చింది. వైసీపీ హయాంలో ఉపాధి సిబ్బంది, ఆ పార్టీ నాయకులు కుమ్మక్కై, మండలంలో రూ. 2 కోట్లకు పైగా స్వాహా చేసినట్లు తెలుస్తోంది.

బుక్కరాయసముద్రం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో ఉపాధి హామీ పథకంలో అంతులేని అవినీతి జరిగింది. ప్రతి గ్రామంలో లక్షలాది రుపాయలు అక్రమాలకు పాల్పడ్డారు. సామాజిక తనిఖీల్లో ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. బుక్కరాయసముద్రం మండలంలోనే రూ. 2 కోట్లపైగా స్వాహా చేసినట్లు అధికారులు నిగ్గు తేల్చారు. ఇంత అవినీతి జరిగినా... రూ. 2లక్షల 50వేలు మాత్రమే అవినీతి జరిగిందని అప్పట్లో ఏపీడీ గుర్తించడం విమర్శలకు దారితీస్తోంది. ఏపీడీ అవినీతి పరులకు అండగా నిలిచినట్లు తాజాగా వెలుగు చూస్తోంది. రెండు కోట్లకుపైగా అవినీతి జరిగిందని సామాజిక తనిఖీ బృందం 2024లోనే గుర్తించింది. అవినీతి జరగలేదని అప్పటి ఏపీడీ నివేదిక ఇవ్వడంపై అనుమానాలకు దారి తీసింది. దయ్యాలకుంటపల్లిలో డేగల చిన్న కుళ్లాయప్పకు జాబ్ కార్డు నెంబరు 30128 ఉంది. ఆయన 2014లో మృతి చెందారు. 2021 సంవత్సరం జూన్ 15న అతడి పేరిట డబ్బులు డ్రా చేశారు. ఉట్టి సూర్యనారాయణ అనే వ్యక్తి మృతి చెందినా.. 2021లో పని చేసినట్లు రూ.42వేలు డబ్బులు డ్రా చేశారు. వడ్డే అరుణ అనే మహిళ మృతి చెందినా.. ఆమె పేరిట రూ. 51,766 డబ్బులు డ్రా చేశారు. ఇలా పరిశీలిస్తే... దయ్యాలకుంటపల్లిలో అవినీతి కుప్పలు తెప్పలుగా బయటికి వస్తోంది. దీని వెనుక ఫీల్డ్ అసిస్టెంట్, ఒక మహిళా మేట్ ఉన్నట్లు గుర్తించారు.

తాజాగా బయటపడిన రూ. 24.50 లక్షల అవినీతి

అప్పుడు సామాజిక బృందం గుర్తించలేని అవినీతి... తాజాగా ఓ ఏపీడీ విచారణ చేపడితే... ఏకంగా చిన్న గ్రామ పంచాయతీ అయిన దయ్యాలకుంటపల్లిలో రూ.24.50 లక్షల వ్యవహారం వెలుగులోకి వచ్చింది. గతంలో తూతూ మంత్రంగా విచారణ చేసినట్లు తెలుస్తోంది. గతంలో సామాజిక తనిఖీల్లో రూ.12 లక్షల 60వేలు అవినీతి జరిగిందని గుర్తించారు. మృతి చెందిన వారి పేర్లతో జాబ్‌కార్డులు సృష్టించి అప్పటి ఫీల్డ్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్, టెక్నికల్ అసిస్టెంట్, సిబ్బంది కలిసి అక్రమాలకు పాల్పడినట్లు తేలింది. దయ్యాలకుంటపల్లి ఉపాధి పనుల్లో అవినీతి జరిగిందని ఆ గ్రామ ప్రజలు ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఏపీడీ చెన్నకేశవులును విచారణాధికారిగా నియమించారు. గత 20 రోజులుగా విచారణ చేపట్టారు. గ్రామంలో 198 నకిలీ జాబ్‌కార్డులు సృష్టించి, అందులో నగదు జమచేశారు. 54 మంది మృతి చెందిన వ్యక్తుల పేరిట జాబ్ కార్డులు తయారు చేసి ఐదు సంవత్సరాల పాటు డబ్బులు కాజేశారు. ఆ గ్రామంలోని ప్రజలే కాకుండా అనంతపురం రూరల్, పామిడి, ఇతర మండలాలకు చెందిన వారి పేరిట జాబ్‌కార్డులను ఆన్‌లైన్‌లో ఎక్కించారు. నకిలీ అకౌంట్లకు (మిగతా 4వ పేజీలో...)

యథేచ్ఛగా అక్రమ లే అవుట్లు

- విచ్చలవిడిగా అమ్మకాలు
- ప్రభుత్వ ఆదాయానికి గండి


రాప్తాడులో వైన్ షాపు వద్ద అనధికారికంగా వేసిన లే అవుట్

రాప్తాడు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): రాప్తాడు గ్రామ పంచాయతీ పరిధిలో సర్వే నెంబర్ 205, 69, 503, 211, 655, 656, 606తో పాటూ మరికొన్ని సర్వే నెంబర్లలో దాదాపు 100 ఎకరాలకు పైగా వ్యవసాయభూమిని అనుమతులు లేకుండా ప్లాట్లు వేసి యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. రాప్తాడు గ్రామం అనంతపురం జిల్లా కేంద్రానికి.. జాతీయ రహదారి దగ్గరగా ఉండటంతో ఇక్కడి భూములకు చాలా డిమాండ్ ఉంది. దీంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు రైతుల వద్ద నుంచి భూమి కొనుగోలు చేసి ప్లాట్లు వేసి విక్రయిస్తున్నారు. వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చాలంటే ల్యాండ్ కన్వర్షన్ తప్పనిసరి. ఇందుకు అహుడాకు దరఖాస్తు చేసుకోవాలి. ప్లాట్లు వేసే ప్రదేశంలో పాఠశాల, అంగన్వాడీ భవనాలు, కమ్యూనిటీ హాళ్లు, పార్కులు తదితర మౌలిక వసతుల కోసం స్థలాలు కేటాయించాలి. వాటన్నింటిని పరిశీలించి అహుడా అధికారులు అనుమతి ఇస్తే ప్లాట్లు వేసి విక్రయించుకోవాలి. అయితే ఈ నిబంధనలు పాటించకుండా.. ఎలాంటి అనుమతులూ లేకుండా నేరుగా లే అవుట్ల వేసి యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడుతోంది. అంతేకాకుండా ప్లాట్లు కొనేవారు అహుడా అనుమతి ఉందా లేదా అని తెలుసుకోకుండా వాటిని కొనుగోలు చేస్తూ మోసపోతున్నారు. ఇలా ఏకంగా సుమారు 100 ఎకరాల్లో అక్రమాలు జరుగుతున్నా.. అహుడా, పంచాయతీ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. దీనిపై రాప్తాడు పంచాయతీ కార్యదర్శి ప్రేమ్ కుమార్‌ను వివరణ కోరగా.. అహుడా, పంచాయతీ అనుమతి లేకుండా లే అవుట్ల వేసిన వారందరికీ నోటీసులు జారీ చేశామని, ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని అన్నారు.

నేడే అన్నదాత సుఖీభవ జమ 5

సాహితీశిఖరం గంగిశెట్టి కన్నుమూత 5

అక్రమాలకు చెక్!

● నిర్భయంగా భూములు కొనవచ్చు ● స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖలో మార్పులు

పీడీ తయారీ సమయంలోనే ఫొటోలు
థంబ్ వేస్తే కొనుగోలుదారుడికే డాక్యుమెంట్

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్లలో అక్రమాలకు చెక్ పడనుంది. ఎవరినో తీసుకొచ్చి ఇతనిదే భూమి అని చెప్పి దొంగ రిజిస్ట్రేషన్ చేయించడం ఇకపై కుదరదు. గతంలో ఒకే పేరున్న వ్యక్తులను తీసుకొచ్చి, ఆధార్ లో మార్పులు(నకిలీ)



ప్రస్తుతం పీడీలో ఫొటోలు

చేసి రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. డబుల్ రిజిస్ట్రేషన్లు సైతం జరిగాయి. వీటన్నింటికీ ఇకపై చెక్ పడనుంది. రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం కాకముందే డాక్యుమెంట్ ఎవరు చేయించుకుంటున్నారో స్పష్టంగా తెలిసిపోతుంది. స్టాంపు లు, రిజిస్ట్రేషన్ల శాఖలో ప్రభుత్వం పలు మార్పులు చేసింది. రిజిస్ట్రేషన్ ప్రక్రియకు ముందు ప్రిపరేషన్ డేటా(పీడీ) తీసే సమయంలో ఇది వరకు సంబంధిత వ్యక్తుల వివరాలు మాత్రమే వచ్చేవి. దీంతో భూమికి సంబంధం లేని వ్యక్తిని తీసుకొచ్చినా తెలిసేదికాదు. ప్రస్తుత మార్పుల నేపథ్యంలో సంబంధిత వ్యక్తి ఆధార్ నెంబర్ చెప్పగానే ఆవ్యక్తి మొబైల్ కు ఓటీపీ వస్తుంది. ఓటీపీ చెప్పగానే ఆధార్‌లో ఉన్న ఫొటో పీడీలో వస్తుంది. మూడురోజుల నుంచి ఈ విధానం అమలవుతోంది.

కొనుగోలుదారుడి చేతికే డాక్యుమెంట్

రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయ్యాక వచ్చే డాక్యుమెంట్ అత్యంత కీలకం. అది ఇకపై నేరుగా సంబంధిత ఆస్తి లేదా భూమి కొనుగోలు చేసిన వ్యక్తికే అందజేయనున్నారు. ఈ విషయంలో గతంలో క్రయ, విక్రయ దారులు ఇబ్బందులు పడేవారు. కొందరు మధ్యవర్తులు జోక్యం చేసుకుని డాక్యుమెంట్లు తీసుకునేవారు. కొన్ని సందర్భాల్లో డాక్యుమెంట్ రైటర్లు తీసుకొని ఎవరో ఒకరికి ఇవ్వడం ద్వారా కొనుగోలు చేసిన వ్యక్తికి దక్కడంలో ఇబ్బందులు ఎదురయ్యేవి. ప్రస్తుత విధానంలో ఎవరైతే కొనుగోలు చేస్తారో వారే కార్యాలయంలో థంబ్ వేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత డాక్యుమెంట్‌ను సంబంధిత వ్యక్తికి అందజేయనున్నారు.

ఓటీపీ ఇక్కట్లు

నూతన విధానంలో కొన్ని సమస్యలు వస్తున్నాయి. ఓటీపీ వల్ల కొన్ని చిక్కులు ఎదురవుతున్నాయి. మొబైల్ ఫోన్‌ను ఆధార్‌కు లింక్ చేసుకోని వారికి ఇది ఇబ్బందిగా మారింది. అత్యవసరంగా రిజిస్ట్రేషన్ కోసం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చి కూడా డాక్యుమెంటేషన్ చేయించుకోలేని పరిస్థితి తలెత్తుతోందని డాక్యుమెంట్ రైటర్లు చెబుతున్నారు. చదువు రానివారు, గ్రామీణ ప్రాంత ప్రజలు ఓటీపీ ద్వారా



అనంతపురం రూరల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

మెసేజ్‌లు అర్థం కాక ఇబ్బంది పడుతున్నారని వారు పేర్కొన్నారు. ఈ క్రమంలో పదుల సంఖ్యలో డాక్యుమెంట్లు పెండింగ్‌లో ఉన్నాయని ఆ వర్గాలు చెబుతున్నాయి. ఆధార్ నంబర్ నమోదు చేయగానే ఓటీపీ రాకుండా కేవలం ఫొటో వచ్చేలా చేస్తే సరిపోతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఫొటోల ద్వారా తెలిసిపోతుంది

రిజిస్ట్రేషన్‌కు ముందు ప్రిపరేషన్ డేటా(పీడీ) తీసే సమయంలో గతంలో ఫొటోలు వచ్చేవి కావు. ఇప్పుడు ఆధార్ ఓటీపీ విధానంతో ఫొటో వస్తోంది. దీంతో సంబంధిత వ్యక్తి అసలైన వ్యక్తా కాదా అనేది స్పష్టంగా తెలిసిపోతుంది. దీంతో మోసాలకు తావుండదు. రిజిస్ట్రేషన్ పూర్తయ్యాక డాక్యుమెంట్‌ను కూడా ఎవరైతే కొనుగోలు చేస్తారో వారే తీసుకోవచ్చు. థంబ్ వేయడం ద్వారా సంబంధిత వ్యక్తే తీసుకోవాల్సి ఉంటుంది.

- రమణరావు, జాయింట్-1 సబ్‌రిజిస్ట్రార్, అనంతపురం

పోయినోళ్లకు ఉపాధి బిల్లులు

(3వ పేజీ తరువాయి)

ఫీల్డ్ అసిస్టెంట్, కొంత మంది వైసీపీ నాయకుల ఫోన్ నెంబర్లకు లింక్ చేసుకుని డబ్బులు డ్రా చేసినట్లు విచారణలో తేలింది. ఇందులో పోస్టల్ సిబ్బంది హస్తం కూడా ఉన్నట్లు తేలింది.

మండలంలో రూ.2 కోట్ల దోపిడీ

వైసీపీ ప్రభుత్వ హయాంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు కలిసి మండల వ్యాప్తంగా రూ. 2కోట్ల పైగా అవినీతికి పాల్పడినట్లు బయటపడింది. బుక్కరాయసముద్రం గ్రామ పంచాయతీలో రూ.2 కోట్లపైగా పనులు చేపట్టగా.. అందులో రూ.1.10 కోట్లు స్వాహా అయినట్లు సామాజిక తనిఖీలో గుర్తించారు. సిద్దరాంపురం గ్రామంలో రూ.8లక్షల, చెదల్లలో రూ.2.67 లక్షలు, పసులూరులో రూ.3.97 లక్షలు, జంతులూరులో రూ.7 లక్షలు, చెన్నంపల్లిలో రూ.7.50 లక్షలు.. ఇలా మొత్తం రూ.2 కోట్ల వరకు అక్రమాలు జరిగినట్లు గుర్తించారు.

అవినీతి బయటపడింది వాస్తవమే

దయ్యాలకుంటపల్లిలో ఉపాధి హామీ పథకంలో 2020 నుంచి 2024 వరకు జరిగిన ఉపాధి పనులలో అవినీతి జరిగింది వాస్తవమే. మృతి చెందిన వ్యక్తుల పేరిట జాబ్ కార్డుల సృష్టించి, వారికి వచ్చిన బిల్లులను స్వాహా చేసినట్లు విచారణలో బయటపడింది. పోస్టు కార్యాలయాన్ని వేదికగా చేసుకుని అవినీతికి పాల్పడినట్లు తేలింది. మొత్తం 198 జాబ్ కార్డులు నకిలీవి అని తేలాయి. అందులో కొంత మందికి నగదును ఇచ్చినట్లు తేలింది. మృతి చెందిన 54 మంది పేరిట ఐదు సంవత్సరాల నుంచి బిల్లులు తీసుకున్నారు. మొత్తం రూ.24.50 లక్షలు స్వాహా అయినట్లు ఇప్పటి వరకు తేలిందన్నారు. ఇంకా విచారణలో ఎంత బయట పడుతుందో తెలియాల్సి ఉంది. ప్రస్తుతం విచారణ చేసిన నివేదికను కలెక్టర్‌కు పంపుతున్నాం.

- చెన్నకేశవులు, ఏపీడీ, డ్వామా

లెక్కే లెక్క..!



రామ్‌నగర్‌లోని జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం

(3వ పేజీ తరువాయి)

సర్వసాధారణంగా ప్రతి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో జరిగే బహిరంగ వ్యవహారం. కొన్ని కార్యాలయాల్లో ప్రతి రోజు 10 నుంచి 15వరకు, మరి కొన్ని కార్యాలయాల్లో 25నుంచి 40వరకు డాక్యుమెంట్లు అవుతుంటాయి. అంటే కనీసం రూ.20వేలు మొదలుకొని దాదాపు రూ.లక్ష వరకు సజావుగా వచ్చే ఆదాయం ఇది. ఇక నిబంధనలకు విరుద్ధంగా చుక్కల భూములు రిజిస్ట్రేషన్ చేస్తే ఎకరాకు రూ.లక్ష నుంచి రూ.1.5లక్ష వరకు వసూలు చేస్తారు. అందులో గిఫ్ట్ డీడ్(దానం) అయితే సగం వరకు తగ్గించి తీసుకుంటారు. ఏవైనా పత్రాలు పొందుపరిచే విషయంలో తేడాలుంటే ఆ లెక్క వేరే ఉంటుంది. ఇక కమర్షియల్ భూములను సాధారణ భూములుగా చూపించి ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టి విక్రయ దారులు ఇచ్చే పైసలు పుచ్చుకుంటారు. సాధారణ భూములను కమర్షియల్ ఏరియాగా చూపించి ఎక్కువ చలానా అవుతుందని, తగ్గిస్తున్నామని చెప్పి మరింత వసూలు చేస్తారు. ఇలాంటి లెక్కలకు అడ్డూ అదుపూ ఉండదు.

సీనియర్ అసిస్టెంట్లకే ఇన్‌చార్జ్ బాధ్యతలు

ఏ ప్రభుత్వశాఖలోనూ లేని సౌలభ్యం రిజిస్ట్రేషన్ శాఖలో ఉంది. ఏ శాఖలోనైనా సీనియర్ అసిస్టెంట్ స్థాయి ఉద్యోగికి ప్రమోషన్ వస్తే సూపరింటెండెంట్ స్థాయికి వస్తారు. కానీ ఇక్కడ రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్ లేకపోతే ఇన్‌చార్జ్‌గా సీనియర్ అసిస్టెంట్లకే బాధ్యత అప్పగిస్తారు. అలా అనంతపురంలోని రెండు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలతో పాటు జిల్లాలో కొన్ని కార్యాలయాల్లో చక్రం తిప్పిన ఘనులున్నారు. వారు సంపాదించిన అక్రమ డబ్బుతో ఎప్పుడో రూ.కోట్లకు పడగలెత్తారు. ఇటీవల కళ్యాణదుర్గంలో ఏసీబీకి దొరికిన నారాయయణస్వామి కూడా సీనియర్ అసిస్టెంటే కావడం గమనార్హం. తాడిపత్రిలో పనిచేస్తున్న ఓ అధికారి ముడుపులు పుచ్చుకోవడంలో బిజీగా ఉంటున్నారు. ఆయనపై లెక్కలేనన్ని ఆరోపణలు ఉన్నాయి. రిజిస్ట్రేషన్ల విషయంలో భారీగానే వెనకేసుకుంటున్నారని సమాచారం. లోకల్, అధికార పార్టీ రాజకీయ మద్దతుతో చెలరేగిపోతున్నారని సమాచారం. శ్రీ సత్యసాయి జిల్లా బుక్కపట్నం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో కీలకంగా ఉన్న ఓ అధికారి ఎన్ఆర్ఐలకు ఆస్తుల విషయంలో బాగానే వెనకేసుకున్నట్లు సమాచారం. తాజాగా ఓ ఘటనలో పోలీస్ కేసు అయ్యాక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి మరీ సంతకాలు చేయించుకొచ్చారు. ఈ వ్యవహారంలో సంబంధిత అధికారికి పెద్ద మొత్తంలోనే ముడుపులు అందినట్లు తెలిసింది. చెన్నేకొత్తపల్లిలో గతంలో పలు భూముల విషయాల్లో అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న కీలక ఉద్యోగి మళ్లీ అక్కడికే పోస్టింగ్ తెచ్చుకున్నారు. ప్రస్తుతం ఆయన అంతా తానై అక్కడ చక్రం తిప్పుతున్నారు.

ఏసీబీకి దొరికిన వారికీ పోస్టులు

అవినీతి వ్యవహారంలో ముదిరిపోయి సస్పెండైన వారికీ, ఏసీబీ అధికారుల తనిఖీల్లో దొరికిన వారికి సైతం కొద్ది కాలానికే పోస్టింగ్ ఇస్తున్నారు. ప్రస్తుతం శ్రీ సత్యసాయి జిల్లా బుక్కపట్నం సబ్‌రిజిస్ట్రార్‌గా ఉన్న రామ్మోహన్ కళ్యాణదుర్గం సబ్‌రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న సమయంలో సస్పెండ్ అయ్యారు. పార్టీ లేకుండానే డాక్యుమెంట్‌ను రద్దు చేసిన విషయంలో ఆయనపై సస్పెన్షన్ వేటు పడింది. అయితే కొద్ది కాలానికే ఆయనకు పోస్టింగ్ ఇచ్చారు. కదిరి సబ్‌రిజిస్ట్రార్‌గా ఉన్న వెంకటనారాయణ చిలమత్తూరు సబ్‌రిజిస్ట్రార్‌గా ఉన్న సమయంలో సస్పెన్షన్‌కు గురయ్యారు. అనంతపురం రూరల్ సబ్‌రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న మహబూబ్ అలీ ఏసీబీ అధికారుల తనిఖీలో ఆయన మేనల్లుడు రూ1.5లక్షలు తీసుకుని పట్టుబడ్డాడు. ఆయనకు గుత్తి సబ్‌రిజిస్ట్రార్‌గా బాధ్యతలు అప్పగించారు. అయితే అనారోగ్యం కారణంగా ఆయన సెలవులో ఉండటంతో సీనియర్ అసిస్టెంట్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. తాజాగా వివాదాస్పదమైన కళ్యాణదుర్గం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో అవినీతిపరులకు పట్టం కట్టారు. సీకే పల్లిలో పని చేసిన సమయంలో భారీగా ఆరోపణలు, అనంతపురం రూరల్ కార్యాలయంలో సస్పెండైన మురళికి కళ్యాణదుర్గం ఇన్‌చార్జ్ సబ్‌రిజిస్ట్రార్‌గా బాధ్యతలు కట్టబెట్టారంటే ఉన్నతాధికారుల ఆలోచనా విధానం ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

చర్యలు తీసుకుంటాం: శ్రీనివాసులు, జిల్లా రిజిస్ట్రారు, అనంతపురం

సబ్‌రిజిస్ట్రార్లు అవినీతికి పాల్పడినట్లు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం. అందులో ఎవరినీ ఉపేక్షించం. పై అధికారులకు నెల మామూళ్లు అనేది అవాస్తవం. కళ్యాణదుర్గం ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్‌ను సస్పెండ్ చేశాం. కొన్ని కార్యాలయాల్లో సీనియర్ అసిస్టెంట్లే ఇన్‌చార్జ్‌లుగా ఉన్నారు. సబ్ రిజిస్ట్రార్ల ప్యానల్ రెడీ అవుతోంది. ఈ నెలాఖరు లోపు సబ్‌రిజిస్ట్రార్లను నియమించే అవకాశం ఉంది.

పీ-4తో సమగ్రాభివృద్ధి

● మంత్రి సత్యకుమార్

ధర్మవరంరూరల్, ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): పీ-4తో సమగ్రాభివృద్ధి వైపు ముందడుగు పడుతుందని మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు. పీ-4 కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నియోజకవర్గస్థాయి అధికారుల తో పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి మంత్రితో పాటు టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్, జనసేన నాయకుడు చిలకం మధుసూదన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యం, ప్రైవేటు రంగ సహకారం, ప్రభుత్వ కార్యాచరణ అనే మూడు మౌలిక అంశాలపై పీ-4 కార్యక్రమం రూపొందించబడిందన్నారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలను బంగారు కుటుంబాలుగా గుర్తించి, వాటిని అభివృద్ధి చేయడానికి ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు 9,584 బంగారు కుటుంబాలను గుర్తించినట్లు వెల్లడించా రు. వీటిలో 5,932కుటుంబాలను



మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్

ఇప్పటికే దత్తత తీసుకున్నట్లు తెలిపారు. ధర్మవరం పట్టణంలో 4,222బంగారు కుటుంబాలు ఉన్నాయని, వీటిలో 3,333 కుటుంబాలు ఇప్పటికే మార్గదర్శులచే దత్తత తీసుకున్నట్లు తెలిపారు. మ్యాపింగ్, జియో ట్యాగ్ ఫొటోలు, కేపీఐఎస్ ఫ్యామిలీ ట్రాకర్ యాప్ వంటి ఆధునిక సాంకేతిక సాధనాలను వినియోగిస్తూ కార్యక్రమాన్ని పారదర్శకంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ మహేష్, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, సీపీపీ అకాడమీషియన్ సురేంద్రనాయుడు, బృంద సభ్యులు, నియోజకవర్గ మార్గదర్శకులు పాల్గొన్నారు.

శ్రమించి.. సాధించారు

(3వ పేజీ తరువాయి)

కోర్టుకు వెళ్లడం, 2024 సార్వత్రిక ఎన్నికల వల్ల కొంత జాప్యమైంది. తర్వాత 2025 జనవరి, ఫిబ్రవరిలో ఈవెంట్స్ నిర్వహించారు. కానిస్టేబుల్ పోస్టుల ఎంపికలో భాగంగా 6484 మంది అభ్యర్థులను ఎత్తు, బరువు, ఛాతీ కొలతల పరీక్షల(ఫిజికల్ స్టాండర్ టెస్ట్)కి పిలిచారు. 4366 మంది అభ్యర్థులు హాజరు కాగా 3907 మంది అర్హత సాధించారు. వీరికి 100 మీటర్స్ పరుగు, లాంగ్ జంప్ ఇతర పరీక్షలు (ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్) నిర్వహించగా 3022 మంది క్వాలిఫై అయ్యారు. ఒక్కో పోస్టుకు సుమారు 100 మంది పోటీ పడ్డారు. ఈ ఏడాది జూన్ తొలివారంలో మెయిన్స్ పరీక్షలు నిర్వహించారు. మంగళగిరిలో హోంమంత్రి అనిత, డీజీపీ ఫలితాలను శుక్రవారం విడుదల చేశారు.

అక్కా తమ్ముడు, అన్నా తమ్ముడు

సోమందేపల్లి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు గొర్రెలు కాస్తూ తమను చదివించడం చూసిన ఆ అక్కా తమ్ముడు పట్టుదలగా చదివారు. పేదరికాన్ని జయించాలని అహర్నిశలు శ్రమించారు. ఈక్రమంలోనే కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఇద్దరు ఒకే సారి ఎంపికయ్యారు. వారే మండలంలోని సుద్దకుంటపల్లి గ్రామానికి చెందిన చక్కీరప్ప, వెంకటలక్ష్మి కుమారుడు సంతోష్, కుమార్తె రాజేశ్వరి. తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రభుత్వ ఉద్యోగం సాధించారు.

● కృషి, పట్టుదల ఉంటే సాధించలేనిది లేదని నిరూపించారు సోమందేపల్లిలోని గీతానగర్‌కు చెందిన అన్నదమ్ములు బుగిడి అనీల్‌కుమార్, బుగిడి సంతోష్‌కుమార్. తండ్రి వెంకటేశ్, తల్లి వెంకటలక్ష్మి ప్రోత్సాహంతో కానిస్టేబుల్ కొలువులు సాధించారు.



1123.92 గ్రాముల బంగారం సీజ్



సీజ్ చేసిన బంగారం, నగదు

తాడిపత్రి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా తాడిపత్రి పోలీసులు 1123.92 గ్రాముల బంగారం ఆభరణాలను సీజ్ చేశారు. అడిషనల్ ఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి ఆధ్వర్యంలో కడప రహదారిలో గురువారం రాత్రి వాహనాలను తనిఖీ చేస్తుండగా ఓ వాహనంలో ఆధారాలు లేని బంగారం ఆభరణాలు కనిపించాయని సీఐ శివగంగాధర్ రెడ్డి శుక్రవారం తెలిపారు. కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన ఉబేదుల్లా, ఆయన కుమారులు కారులో తాడిపత్రికి వస్తుండగా అనుమానంతో తనిఖీలు చేశామని తెలిపారు. బిల్లులు సరిగా లేకపోవడంతో వారి వద్ద ఉన్న బంగారంతోపాటు రూ.1,48,700 నగదును సీజ్ చేశామని తెలిపారు. వాటిని పరిశీలించి కస్టమ్స్ అధికారులకు అప్పగించామని తెలిపారు.

డెప్యుటేషన్‌పై నలుగురు గుమాస్తాల బదిలీ

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా పంచాయతీ కార్యాలయంలోని నలుగురు గుమాస్తాలను డెప్యుటేషన్‌పై బదిలీ చేస్తూ డీపీఓ నాగరాజనాయుడు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. సీనియర్ అసిస్టెంట్ ఉషారాణిని డీఎల్‌పీఓ కార్యాలయానికి బదిలీ చేశారు. డీఎల్‌పీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న మనోహర్‌ను డీపీఓ కార్యాలయానికి బదిలీ చేశారు. డీపీఓ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉన్న నితీష్‌కుమార్‌ను గుంతకల్లు డీఎల్‌పీఓ కార్యాలయానికి బదిలీ చేశారు. ఆ స్థానంలో అనంతపురం డీఎల్‌పీఓ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉన్న భారతిని నియమించారు. బదిలీల ప్రక్రియ ముగిసిన తరువాత వర్కింగ్ అడ్జెస్ట్‌మెంట్ పేరుతో బదిలీలకు శ్రీకారం చుట్టడం పలువురు సిబ్బందికి షాక్ ఇచ్చినట్లు అయింది. సాధారణ బదిలీల్లో భాగంగా జూనియర్ అసిస్టెంట్‌గా డీపీఓ కార్యాలయానికి వచ్చిన నితిష్‌కుమార్‌ను తిరిగి గుంతకల్లుకు మార్చడంపై ఏఓ నాగరాజుతో ఆయన వాదనకు దిగినట్లు తెలిసింది. అయితే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మార్చాల్సి వచ్చిందని చెప్పినట్లు సమాచారం.

'5న జర్నలిస్టుల డిమాండ్స్ డే పాటిద్దాం'

పుట్టపర్తిరూరల్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఈనెల 5న జర్నలిస్టుల డిమాండ్స్ డేగా పాటించాలని ఏపీయూడబ్ల్యూజే పిలుపునిచ్చింది. ఈ మేరకు శుక్రవారం శ్రీసత్యసాయిజిల్లా కమిటీ అధ్యక్షుడు పుల్లయ్య, కార్యదర్శి బాబు, ఐజేయూ సభ్యుడు శ్రీనివాసులు, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు హరి, రాష్ట్ర కమిటీ సభ్యులు మురళి, జి. వెంకటనారాయణ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లాతో పాటు మండల, రెవెన్యూ డివిజనల్ కేంద్రాలలో ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో జర్నలిస్టులంతా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పేర్కొన్నారు. కొత్త అక్రిడిటేషన్ కార్డులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని జర్నలిస్టులు ఆయా ప్రాంతాల్లో ఈనెల 5న నిరసన కార్యక్రమాలు చేపట్టి అధికారులకు వినతి పత్రాలు అందచేయాలని తెలిపారు.

కృష్ణా జలాలకు పూజలు



పూజలు చేస్తున్న అధికారులు

కూడేరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): జీడిపల్లి రిజర్వాయర్ నుంచి పీఏబీఆర్ డ్యాంలోకి కృష్ణా జలాలు వస్తుండటంతో ఇరిగేషన్ అధికా రులు శుక్రవారం పూజలు చేశారు. పీఏబీఆర్ డ్యాం డీఈఈ వెంకటరమణ, ఏఈఈలు లక్ష్మిదేవి, గంగమ్మ, ముత్యాలప్ప, రేణుక తదితరులు కొర్రకోడు గ్రామ సమీపంలో కృష్ణా జలాలకు పూజలు చేశారు. జీడిపల్లి రిజర్వాయర్ నుంచి వెయ్యి క్యూసెక్కుల నీరు పీఏబీఆర్ డ్యాంలోకి చేరుతోంది. దీంతో డ్యాంలో నీటి నిల్వ 1.852 టీఎంసీలకు చేరింది.

దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురంరూరల్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఖాళీగా ఉన్న వివిధ కేటగిరీల సీట్ల భర్తీకి దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ జయచంద్రారెడ్డి తెలిపారు. ఆమేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కళాశాలలో వివిధ కేటగిరీల్లో 25సీట్లు, ఈడబ్ల్యూఎస్‌లో మూడు సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈనెల నాలుగో తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. 5న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తామని తెలిపారు. స్పాట్ అడ్మిషన్లు పొందే విద్యార్థులు ప్రభుత్వ స్కాలర్ షిప్‌కు అనర్హులన్నారు. అడ్మిషన్ కోసం వచ్చే విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. ఫీజు మొత్తం కట్టాల్సి ఉంటుందన్నారు. అనంతపురంతోపాటు జిల్లాలోని కళ్యాణదుర్గం, రాయదుర్గం, తాడిపత్రి, ఉరవకొండ, గుంతకల్లులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో ఖాళీ సీట్లకు కూడా స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఇన్నొవేషన్ సెంటర్‌లో ఏర్పాట్లు పూర్తి చేస్తాం

● వీసీలో ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణ శర్మ

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): రతన్ టాటా ఇన్నొవేషన్ సెంటర్‌లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తామని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణ శర్మ తెలిపారు. రతన్ టాటా ఇన్నొవేషన్ సెంటర్‌ల ఏర్పాటుపై గుంటూరు, వైజాగ్, రాజమండ్రి, ఎన్టీఆర్, అనంతపురం, తిరుపతి జిల్లాల జాయింట్ కలెక్టర్లతో విజయవాడ నుంచి ఐటీ సెక్రటరీ భాస్కర్ కాటమనేని శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి వీసీలో ఇన్‌చార్జ్ కలెక్టర్‌తో పాటు అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్ పాల్గొన్నారు. ఇన్‌చార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ నగరంలోని జేఎన్టీయూ అడ్మిన్ బిల్డింగ్‌లో ఏర్పాటు చేస్తున్న రతన్‌టాటా ఇన్నొవేషన్ సెంటర్‌లో అవసరమైన పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటామని తెలిపారు. రతన్ టాటా ఇన్నొవేషన్ సెంటర్ గురించి పరిశ్రమలు, విద్యాసంస్థలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమా లను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఎస్ఈ మురళీకృష్ణ, డీఈ రాజగోపాల్, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ప్రతాప్‌రెడ్డి, జేఈ బాలకాటమయ్య పాల్గొన్నారు.

ప్రపంచీకరణను దాటుకుని కవిత్వం రాయాలి

● కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య రాచపాలెం



అమరమ్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రచయితలు

అనంతపురం టౌన్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): వర్తమాన కవి ప్రపంచీకరణను దాటుకుని కవిత్వం రాయాలని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. తెలుగు వెలుగు సాహిత్య సామాజిక సంస్థ ఐదో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు టీవీ రెడ్డి రచించిన 'అమరమ్' పుస్తకావిష్కరణ సభను శుక్రవారం జిల్లా కేంద్ర గ్రంథాలయ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఉమ్మడిశెట్టి సాహితీ ట్రస్టు చైర్మన్ రాధేయ అధ్యక్షతన నిర్వహించిన ఈ సభకు ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించిన మాట్లాడారు. వర్తమాన కవి ప్రపంచీకరణ దాటుకుని కవిత్వం రాయలేని పరిస్థితి ఉందని, ఈ ప్రపంచీకరణ నుంచే అన్ని వాదాలు ఏర్పడ్డాయని, కవి అయినవారు చాలా జాగ్రత్తగా వర్తమాన వాదాలను పట్టుకుని కవిత్వం రాయాల్సిన అవసరం ఉందన్నారు. టీవీ రెడ్డి సామాన్య కార్మికుడుగా ప్రస్థానం ప్రారంభించి సామాజిక సేవా కార్యకర్తగా ఎదుగుతూ, సాహిత్య రంగంలోకి ప్రవేశించి, కవిత్వంలో కూడా నిబద్ధతను చాటుతూ 'అమరమ్' కవితా సంపుటిని తీసుకురావడం అభినందనీయమన్నారు. అనంతరం పలువురు కవులు, కళాకారులను సత్కరించారు. కార్యక్రమంలో జనప్రియ కవి ఏలూరు యంగన్న, కేంద్ర గ్రంథాలయ కార్యదర్శి రమా, అమరనాథరెడ్డి, ఆదినారాయణ, మంచాల రామకృష్ణారెడ్డి, పొట్లూరు హరికృష్ణ, సంజీవులు, సుబ్బరంగయ్య, గద్వాల సోమన్న, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బండి నారాయణస్వామి, డాక్టర్ శాంతినారాయణ, తూముచర్ల రాజారాం, వెంకటేశ్వర్లు, సురేష్,జయరాం, మధురశ్రీ, రియాజుద్దీన్ పాల్గొన్నారు.

కళామతల్లి ముద్దుబిడ్డ రాఘవ



అనంతపురం టౌన్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): భారతదేశం గర్వించదగ్గ కళామతల్లి ముద్దుబిడ్డ బళ్లారి రాఘవ. శనివారం ఆయన 145వ జయంతి. బళ్లారి రాఘవగా పేరొందిన తాడిపత్రి రాఘవాచార్యులు 1880 ఆగస్టు 2న అనంతపురం జిల్లా తాడిపత్రిలో నరసింహాచారి, శేషమ్మ దంపతులకు జన్మించారు. బళ్లారిలో ఉన్నత పాఠశాలలో మెట్రిక్ వరకు చదువుకున్న రాఘవ తర్వాత మద్రాసులోని క్రిస్టియన్ కాలేజీలో న్యాయశాస్త్రం కోర్సులో చేరారు. 1905లో న్యాయశాస్త్రంలో ఉత్తీర్ణత పొందారు. కర్నూలుకు చెందిన లక్ష్మణాచారి కుమార్తె కృష్ణమ్మను జీవిత భాగస్వామిగా చేసుకున్నారు. మద్రాసులోనే న్యాయశాస్త్రం ప్రాక్టీసు ఆరంభించి, కొద్దికాలంలోనే న్యాయవాదిగా మారారు. కానీ ఆయనకు చిన్నప్పటి నుంచే నాటకాలపై అమితాసక్తి ఉండేది. మేనమామ ధర్మవరం రామకృష్ణవచార్యులు రాఘవను ప్రోత్సహించేవారు. 12వ యేటనే రాఘవ మొదటిసారి రంగస్థలంపై నటించారు. బళ్లారిలో షేక్‌స్పియర్ క్లబ్ స్థాపించి, దానిద్వారా షేక్‌స్పియర్ నాటకాలు ప్రదర్శించేవాడు. తెలుగు, కన్నడ, ఇంగ్లీషు, హిందీ భాషలన్నింటిలోనూ రాఘవ ప్రదర్శనలిచ్చారు. శ్రీలంక, ఇంగ్లాండు, ఫ్రాన్స్, జర్మనీ, స్విట్జర్లాండ్ వంటి దేశాలలో పర్యటించి భారతీయ నాటకాలు, కళలను గురించి ఉపన్యాసాలు, సదస్సులు నిర్వహించారు. మిత్రుల ఒత్తిడితో 1936లో రాఘవ సినీ రంగ ప్రవేశం చేశారు. హెచ్ఎం రెడ్డి నిర్మించిన 'ద్రౌపదీమాన సంరక్షణము' చిత్రంలో దుర్యోధనుడుగా నటించారు. రైతుబిడ్డ, చండిక, కన్యాశుల్కం సినిమాల్లోనూ నటించి అనతికాలంలోనే విశేష ఖ్యాతి పొందారు. తన సమయాన్ని, సంపదను నాటకరంగ పురోగతి కోసం ధారాళంగా వెచ్చించే బళ్లారి రాఘవ 1946 ఏప్రిల్ 16న స్వర్గస్థులయ్యారు.

బళ్లారి రాఘవ పేరిట అవార్డు స్థాపన...


బళ్లారి రాఘవ కళారంగంతోపాటు ఈ లోకాన్ని వీడిన నాటి నుంచి కళాసంస్థలు, కళాకారులు ఆయనను స్మరించుకుంటూ ప్రతియేటా జయంతి, వర్థంతి సమయాల్లో విశేషమైన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా అనంతపురం జిల్లా కేంద్రంలోని లలితకళాపరిషత్ ఆధ్వర్యంలో 1999లో బళ్లారి రాఘవ అవార్డును స్థాపించారు. నాటి నుంచి యేడాదికోసారి సినీ, నాటక రంగాల్లో ఉత్తమ నటులను ఎంపిక చేసి రాష్ట్రస్థాయిలో అవార్డుల ప్రదానం చేస్తున్నారు. 1999లో సినీనటుడు నూతన్‌ప్రసాద్‌కు తొలి అవార్డు ప్రదానం చేశారు. 2025 ఏడాదికి సంబంధించి తెనాలికి చెందిన మేరిగె రామలింగేశ్వరరావు, గుంటూరు జిల్లా రేపల్లెకు చెందిన భూపతి ధర్మారావుకు రాష్ట్రస్థాయి బళ్లారి రాఘవ అవార్డులు, జిల్లాకు చెందిన వాల్మీకి కుళ్లాయప్ప, మల్లెల జయరాం జిల్లా స్థాయి అవార్డులకు ఎంపికయ్యారు. శనివారం సాయంత్రం లలితకళాపరిషత్‌లో నిర్వహించే అవార్డు ప్రదానోత్సవ సభలో వీరికి బళ్లారి రాఘవ అవార్డులు అందజేసి సత్కరించనున్నారు.



మేరిగె రామలింగేశ్వరరావు, భూపతి ధర్మారావు, వాల్మీకి కుళ్లాయప్ప, మల్లెల జయరాం

నేడు బళ్లారి రాఘవ 145వ జయంతి
నలుగురికి రాఘవ అవార్డులు

అవార్డులతో కళాకారులకు ప్రోత్సాహం



జిల్లావాసి అయిన బళ్లారి రాఘవ కళల్లో నిష్ణాతుడు. కళారంగం అభివృద్ధి కోసం విశేష సేవలందించిన ఇలాంటి మహోన్నతులను భావితరాలకు పరిచయం చేయడంతో పాటు కళాకారులను ప్రోత్సహించేందుకు ప్రతియేటా బళ్లారి రాఘవ అవార్డులను ప్రదానం చేస్తున్నాం. అవార్డులతోపాటు ప్రతియేటా బళ్లారి రాఘవ జయంతి రోజున నాటక ప్రదర్శనలు నిర్వహిస్తున్నాం. శనివారం సాయంత్రం అవార్డుల ప్రదానోత్సవ సభ, అనంతరం 'గోవు మా లచ్చిమి' సాంఘిక నాటక ప్రదర్శన నిర్వహించనున్నాం.

- గాజుల పద్మజ,
ప్రధాన కార్యదర్శి, లలితకళాపరిషత్

సెంట్రల్ యూనివర్సిటీ
విద్యార్థులకు అస్వస్థత

వంద మందికి పైగా ఆసుపత్రిపాలు



చికిత్సకోసం ప్రైవేట్ ఆసుపత్రికి వచ్చిన విద్యార్థులు







చికిత్స పొందుతున్న విద్యార్థులు

అనంతపురం వైద్యం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): అనంతపురం సెంట్రల్ యూనివర్సిటీలో గురు, శుక్ర వారాల్లో దాదాపు వంద మందికిపైగా విద్యార్థులు ఆసుపత్రి పాలయ్యారు. వివిధ రాష్ట్రాలకు చెందిన 1600 మందికిపైగా విద్యార్థులు ఇక్కడ డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ కోర్సులు అభ్యసిస్తున్నారు. వేసవి సెలవుల అనంతరం గతనెల 21నుంచి విద్యార్థులు తిరిగి వర్సిటీకి వస్తున్నారు. వాతావరణ మార్పుల నేపథ్యంలోనే విద్యార్థులు అస్వస్థకు గురయ్యారని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. విద్యార్థులను పరీక్షించిన వైద్యవర్గాలు మాత్రం ఫుడ్‌పాయిజన్, కలుషిత నీరు కారణమై ఉంటుందని పేర్కొంటున్నాయి. విద్యార్థుల అస్వస్థత నేపథ్యంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీదేవి సెంట్రల్ యూనివర్సిటీని సందర్శించారు. వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయించారు. జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్లు, బుక్కరాయసముద్రం ప్రాథమిక వైద్య కేంద్రం డాక్టర్లు విద్యార్థులు పరీక్షించారు.

రెండు రోజులుగా...

సెంట్రల్ వర్సిటీలోని విద్యార్థులు గురువారం నుంచి శుక్రవారం వరకు అస్వస్థకు గురయ్యారు. తీవ్ర జ్వరం, తలనొప్పి, కళ్లతిరిగి పడిపోవడం, కడుపునొప్పి, గొంతునొప్పి, వాంతులు, విరేచనాలతో బాధపడ్డారు. గురువారం మధ్యాహ్నం కొంతమంది బాధిత విద్యార్థులను వర్సిటీ బస్సులో అనంతపురంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. వారిలో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్న విద్యార్థులకు అడ్మిషన్ చేసి వైద్యసేవలందిస్తున్నారు. ఇలా శుక్రవారం వరకు మూడు నుంచి నాలుగు సార్లు విద్యార్థులను బస్సులో ఆసుపత్రికి తరలించారు. గురువారం తెల్లవారుజామున కొంతమంది విద్యార్థులు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు వచ్చివెళ్లారు. వీరిలో బాలికలే అధికంగా ఉన్నారు. 50మందికిపైగా క్యాజువాల్టీ, వార్డుల్లో అడ్మిషన్ అయ్యారు. ఆస్పత్రిలో చేరిన విద్యార్థులకు తోటి విద్యార్థులే సపర్యలు చేస్తున్నారు. కాగా వర్సిటీలోని కొందరి అధికారులు తీరు రోజురోజుకు వివాదాస్పదమవుతోంది. వారి పరిధిలో ఏదైనా సమస్య ఏర్పడినప్పుడు ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వకుండా సొంతనిర్ణయాలు తీసుకుంటున్నారని విద్యార్థి వర్గాలు మండిపడుతున్నాయి. ఏ విషయం జరిగినా గోప్యంగా ఉంచుతున్నట్లు పలువురు విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కోలుకుంటున్నారు: ప్రొఫెసర్ ఎస్ఏ కోరి, వీసీ

అస్వస్థతకు గురైన విద్యార్థులకు ఎప్పటికప్పుడు వైద్యులతో పరీక్షలు చేయిస్తున్నాం. నెమ్మదిగా అందరూ కోలుకుంటున్నారు. ప్రస్తుతం వాతావరణం మార్పుల నేపథ్యంలోనే వివిధ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నారు. తాగునీరు, ఆహారం కలుషితం తో విద్యార్థులు అస్వస్థతకు గురికాలేదు. డీఎంహెచ్‌ఓ ఆధ్వర్యంలో వర్సిటీలో వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేశాం.

మహిళ అదృశ్యం



మంగమ్మ

కూడేరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఉదిరిపికొండ గ్రామానికి చెందిన మంగమ్మ అనే మహిళ అదృశ్యమయింది. పది రోజుల క్రితం ఆమె ఇంటి నుంచి వెళ్లిపోవడంతో బంధువులు, చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించామని, ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆమె భర్త సూర్యనారాయణ తెలిపారు. కేసు నమోదు చేసి ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు ఏఎస్ఐ రామానాయుడు తెలిపారు.

విద్యార్థి ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న విద్యార్థి

చెన్నేకొత్తపల్లి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): తాను చదువుకుంటున్న స్కూల్‌ను మార్చారనే మనస్తాపం చెందిన ఓ విద్యార్థి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన ఘటన మండలంలోని నామాల గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన మేరకు.. గ్రామానికి చెందిన సంజమ్మ, సుబ్రహ్మణ్యం దంపతుల కుమారుడు జగన్మోహన్ మండలంలోని మేడాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతుండేవాడు. ఈ క్రమంలో విద్యార్థి తల్లి సంజమ్మ రెండు రోజుల క్రితం మేడాపురం నుంచి పెనుకొండ ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు. అక్కడే ప్రభుత్వ హాస్టల్‌లో చేర్చారు. తాను అక్కడ చదువుకోవడానికి ఇష్టంలేదంటూ విద్యార్థి ఇంటికి తిరిగి వచ్చాడు. ఈ నేపథ్యంలో ఇంటిలో విషపు గుళికలు మింగాడు. వెంటనే కుటుంబ సభ్యులు గమనించి ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి.. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ విద్యార్థి కోలుకుంటున్నట్టు బంధువుల ద్వారా తెలిసింది.

సాహితీశిఖరం గంగిశెట్టి కన్నుమూత


కాలిఫోర్నియాలో కొడుకు ఇంట తుదిశ్వాస
తనకల్లులో పుట్టి పెరిగిన లక్ష్మీనారాయణ
నివాళులు అర్పించిన సాహితీవేత్తలు



గంగిశెట్టి లక్ష్మీనారాయణ (ఫైల్)

అనంతపురం టౌన్/తనకల్లు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): తనకల్లుకు చెందిన సాహితీవేత్త ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణ కన్నుమూశారు. అమెరికాలోని కాలిఫోర్నియాలో కుమారుడు వంశీ నివాసంలో ఆయన భారత కాలమానం ప్రకారం శుక్రవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. గంగిశెట్టి లక్ష్మీనారాయణ 1947లో తనకల్లులో జన్మించారు. ఆయన తల్లిదండ్రులు జింకా రుక్మిణమ్మ, జింకా గంగిశెట్టి దంపతులు. ఆయన చిన్నతనంలోనే తండ్రి మృతిచెందారు. తాత చెన్నరాయప్ప అన్నీ తానై పెంచి పెద్ద చేశారు. ఆయన విద్యాభ్యాసం తనకల్లు, కదిరి, హైదరాబాదులో కొనసాగింది. తెలుగులో ఎంఏ, ఎంఫిల్, పీహెచ్‌డీ చేశారు. సంస్కృతంలో ఎంఏ, బీఈడీ చేశారు. బీఈడీలో ఉత్తమ ప్రతిభను కనబరచి, రెండు బంగారు పతకాలు అందుకున్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం అందుకున్నారు. ఆయన ప్రభుత్వ ఉద్యోగంలో ఉండగా, అప్పటి విద్యుత్ శాఖమంత్రి అగిశం వీరప్ప వద్ద పీఏగా కొన్ని రోజులు పనిచేశారు. లక్ష్మీపార్వతికి తెలుగు నేర్పించారు. పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో తులనాత్మక అధ్యయనశాఖ అధ్యక్షుడిగా పనిచేసి పదవీ విరమణ పొందారు. ద్రవిడ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్‌గా సేవలు అందించారు. రిటైర్డు అయిన తరువాత అందరికీ విద్యను అందించాలన్న ఉద్దేశంతో కిషోర్ స్కూల్‌ను స్థాపించారు. వివిధ కారణాలతో రెండేళ్లకే అది మూత పడింది. అనంతరం ఆయన అమెరికాలో ఉన్న కుమారుడి వద్దకు వెళ్లిపోయారు. ఆయన మృతికి పలువురు సాహితీవేత్తలు సంతాపం తెలిపారు.


అమ్మ మాట మీరే వారు కాదు



జింకా లక్ష్మీనారాయణ ఎంతో ఉన్నత పదవిలో ఉన్నా, అమ్మ రుక్మిణమ్మ మాట మీరే వారు కాదు. వారు ఇక్కడి నుంచి వెళ్లిపోయాక ఇంటిని అమ్మకానికి పెట్టారు. కొనేందుకు ఎంతో మంది పోటీ పడ్డారు. కానీ రుక్మిణమ్మ వారి ఇంటిని నాకే అమ్మేందుకు ఇష్టపడ్డారు. ప్రతి సంవత్సరం నా భార్యకు ఆయన పుట్టింటి చీర అందించేవారు. ఆయన మరణం ఈ ప్రాంత ప్రజలకు తీరని లోటు.

– డాక్టర్ చలపతి నాయుడు, స్నేహితుడు

తీరని లోటు..



గొప్ప తాత్వికవేత్త, మహా పండితోత్తముడు ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణ మృతి తెలుగు సాహిత్యానికి తీరని లోటు. ఉమ్మడి అనంతపురం జిల్లా గొప్ప సాహితీవేత్తను కోల్పోయింది. దశాబ్ద కాలంగా నేను చదివిన నవలల్లో 'పర్వ' నవల ఆకట్టుకున్నంతగా మరే నవలా ఆకట్టుకోలేదు. ఆయన వాక్యము, వాచకమూ గొప్ప తాత్విక చింతనతో పాఠకులను, సాహిత్య శ్రోతలను అగాధమైన భావనాలోకాల్లోకి తీసుకెళ్తాయి. ఇంకా పదికాలాలపాటు ఉండవలసిన విద్వన్మణి, విపశ్చిద్దంతి హఠాత్తుగా కానరానిలోకాలకు వెళ్లడం బాధాకరం.

– డాక్టర్ శాంతినారాయణ, విమలాశాంతి సాహిత్య సామాజిక సేవాసంస్థ వ్యవస్థాపకుడు

గర్వంలేని మనిషి..



ఒంగోలులో జరిగిన ఓ సాహితీ సభలో నాకు గంగిశెట్టి లక్ష్మీనారాయణతో పరిచయం ఏర్పడింది. అప్పటి నుంచి సాహిత్య కార్యక్రమాలపై తరచూ ఫోన్‌లో మాట్లాడుకునేవాళ్లం. ఉమ్మడిశెట్టి అవార్డుకు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మంచి గుర్తింపు ఉందని, దీనిని ఇలాగే కొనసాగించాలని ఆయన చెప్పిన మాటలు మరవలేను. సాహిత్య విమర్శపట్ల ఎంతో చొరవ చూపేవారు. ఎలాంటి గర్వం లేకుండా అన్ని వయసులవారిపట్ల ఎంతో అణకువగా వ్యవహరించేవారు. ఆయన నుంచి వర్తమాన సాహితీవేత్తలు నేర్చుకోవాల్సిన అంశాలు చాలా ఉన్నాయి.

– రాధేయ, కవి, ఉమ్మడిశెట్టి లిటరరీ ట్రస్టు వ్యవస్థాపకుడు

నేడే అన్నదాత సుఖీభవ జమ

జిల్లాలో 2,75,642 మంది రైతులకు అర్హత
రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.137.82 కోట్లు
పీఎం కిసాన్ ద్వారా రూ.53.63 కోట్ల లబ్ధి
ఎన్‌పీసీఐ సమస్యతో 7,802 మందికి పెండింగ్
అధికారుల నిర్లక్ష్యం..
పెండింగ్ జాబితా రైతుల్లో ఆందోళన



అనంతపురం అర్బన్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): 'సూపర్ సిక్స్' హామీల అమలులో భాగంగా మరో ముందడుగు పడుతోంది. గత సార్వత్రిక ఎన్నికలకు ముందు రైతులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ శనివారం ఉదయం 11 గంటలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నదాత సుఖీభవ పథకాన్ని ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా నేరుగా రైతుల ఖాతాలకు సొమ్మును జమ చేయనున్నారు. ఇందులో భాగంగా జిల్లా యంత్రాంగం ప్రతి నియోజకవర్గంలో అన్నదాత సుఖీభవ పథకం ప్రారంభోత్సవ కార్యక్రమాలు నిర్వహించేలా ఏర్పాట్లు చేసింది. జిల్లా వ్యాప్తంగా 2,75,642 మంది రైతులను అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాలకు అర్హులుగా గుర్తించారు. అర్హులైన రైతులకు ఈ పథకం ద్వారా రూ.137.82 కోట్లు, పీఎం కిసాన్ ద్వారా రూ.53.63 కోట్లు జమ కానుంది. మొత్తం రూ.191.45 కోట్లు రైతులకు లబ్ధి చేకూరనుంది. వైసీపీ ప్రభుత్వంలో ఏడాదికి రూ.13,500 రైతుల ఖాతాలకు రాష్ట్ర ప్రభుత్వం రెండు విడతల్లో, కేంద్రం మూడు విడతల్లో జమ చేసింది. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం వాటా కింద రూ.7,500, కేంద్ర ప్రభుత్వం వాటా రూ.6,000 జమ చేస్తూ వచ్చారు. గత ఎన్నికలకు ముందు చంద్రబాబు అన్నదాత సుఖీభవ కింద ఏడాదికి పెట్టుబడి సాయం కింద రూ.20వేలు జమ చేస్తామని హామీ ఇచ్చారు. ఏడాదిలో మూడు విడతలుగా అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ సొమ్ము జమ చేయాలని నిర్ణయించారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.14వేలు, కేంద్రం నుంచి రూ.6వేలు జమ చేయనున్నారు. ఈ ఏడాదిలో తొలి విడతలో రాష్ట్రం రూ.5వేలు, కేంద్రం రూ.2వేలు, రెండో విడతలో రాష్ట్రం రూ.5వేలు, కేంద్రం రూ.2వేలు, మూడో విడతలో రాష్ట్రం రూ.4వేలు, కేంద్రం రూ.2వేలు జమ చేయనుంది. తొలి విడతలో ఒక్కో రైతుకు రూ.7వేలు జమ కానుంది.

అన్నదాత సుఖీభవకు ఎన్‌పీసీఐ సమస్య

అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైన రైతులకు ఎన్‌పీసీఐ (నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) సమస్య వెంటాడుతోంది. అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులుగా గుర్తించిన రైతుల్లో 7,802 మందికి ఎన్‌పీసీఐ పెండింగ్ ఉంది. అంటే బ్యాంక్ ఖాతాకు ఆధార్ లింక్ లేకపోవడంతో పెండింగ్‌లో జాబితాలో ఉండిపోయారు. అలాగే 5,674 మందికి ఈకేవైసీ రిజక్ట్ అయ్యింది. మరో 530 మంది రైతులతో ఈకేవైసీ చేయించాల్సి ఉంది. ఈకేవైసీతోపాటు ఎన్‌పీసీఐ సవ్యంగా ఉంటేనే అన్నదాత సుఖీభవ సొమ్ము జమ అవుతుంది. ఈ నేపథ్యంలో ఎన్‌పీసీఐ, ఈకేవైసీ పెండింగ్‌లోని రైతులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత వ్యవసాయ యంత్రాంగం ముందస్తుగా ప్రణాళికాబద్ధంగా పనిచేసే ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదన్న వాదనలు వినిపిస్తున్నాయి. అత్యధికంగా కళ్యాణదుర్గంలో 569 మంది రైతులకు ఎన్‌పీఐసీ పెండింగ్‌లో ఉంది. రాప్తాడులో 432, పుట్లూరు 366, గుంతకల్లు 367, విడపనకల్లు 459, గుమ్మగట్ట 303, డి.హిరేహాల్ 240, శెట్టూరు 230, బెలుగుప్ప 250, రాయదుర్గం 235, ఉరవకొండ 216, కూడేరు 344, బుక్కరాయసముద్రం 203, వజ్రకరూరు 237, కంబదూరు 351, పామిడి 243, పెద్దవడుగూరు 218 మంది రైతులకు ఎన్‌పీసీఐ పెండింగ్‌లో ఉంది. మిగిలిన మండలాల్లోను పలు గ్రామాలకు చెందిన రైతుల ఎన్‌పీసీఐ పెండింగ్‌లో ఉంది. సంబంధిత రైతులకు సమాచారం అందించడంతోపాటు బ్యాంకర్లను సంప్రదించి, పెండింగ్‌లోని ఎన్‌పీసీఐని పూర్తి చేయడంలో పలు మండలాల అధికారులు నిర్లక్ష్య వహించారన్న విమర్శలు ఉన్నాయి. ఈ విషయంపై జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ పలు మండలాల ఏఓలపై టెలికాన్ఫరెన్స్‌లో సీరియస్ అయ్యారు. అన్నదాత సుఖీభవ ఈనెల 2వతేదీ ప్రారంభమవుతుందని తెలిసినా, ఎన్‌పీసీఐ, ఈకేవైసీని పూర్తి చేయించలేకపోవడంపై నిర్లక్ష్యం వహించడం పలు విమర్శలకు తావిస్తోంది.

అంకుల్..! మా నాన్న ఎప్పుడొస్తారు ?

అమాయకంగా ప్రశ్నిస్తున్న పిల్లలు
ఖతర్‌లో తనకల్లు వాసి మృతి
శోకసంద్రంలో తల్లి, భార్య
మృతదేహాన్ని తెప్పించేందుకు ప్రయత్నాలు



విషాదంలో నూరుల్లా కుటుంబ సభ్యులు

తనకల్లు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): తండ్రి మరణ వార్త తెలియని చిన్నారులు అంకుల్..! మానాన్న ఎప్పుడొస్తారు? అని ప్రశ్నించడం అక్కడున్న వారందరినీ కలిచివేస్తోంది. తనకల్లుకు చెందిన నూరుల్లా (36) ఖతర్‌లోని వకారాలో గురువారం మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో ఆ కుటుంబం తీవ్ర దుఃఖంలో మునిగిపోయింది. విలపిస్తున్న తల్లి, నానమ్మ, బంధువులను చూసి వీరంతా ఎందుకు ఏడుస్తున్నారు? అసలు ఏమైందని ఆ పిల్లలు అడుగుతుండటంతో అక్కడున్న వారికి కన్నీరు ఆగడం లేదు. మృతుడు నూరుల్లాకు నాలుగో తరగతి చదువుతున్న అయేషా, ఆరోతరగతి చదువుతున్న షానీకొర్ అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

అప్పు తీర్చడానికి వెళ్లి...

కరోనా సమయంలో బతుకుతెరువు కోసం నూరుల్లా ఓ ఐషర్ వాహనం కొనుగోలు చేశాడు. అయితే అందులో నష్టాలు రావడంతో రూ.10 లక్షలు అప్పు మిగిలింది. దీంతో ఇక్కడే ఉంటే అప్పులు తీర్చలేనని భావించి, ఇంట్లో భార్య, తల్లిని ఒప్పించి ఖతర్ దేశానికి వెళ్లాడు. అక్కడ వకారా నగరంలో ఓ యజమాని వద్ద డ్రైవర్‌గా పనికి చేరాడు, మూడు సంవత్సరాల 4నెలలుగా అక్కడే పని చేస్తున్నాడు. ఈక్రమంలోనే చేసిన అప్పులన్నీ తీర్చేశాడు. ఇంకో నెల రోజులు పని చేసి అంతో ఇంతో డబ్బులు చేతపట్టుకుని ఇంటికి రావాలనుకున్నాడు. ఇదే విషయాన్ని నాలుగు రోజుల కిందట తల్లి ఫరీయాద్, భార్య షాబాజీకి ఫోన్ చేసి చెప్పాడు. ఇంతలో ఏమైందో ఏమో తెలియదుకానీ, అతడితో కలిసి పని చేస్తున్న మరో డ్రైవర్ ప్రమాదంలో నూరుల్లా గురువారం మృతి చెందినట్లు సమాచారం అందించారు. దీంతో కుంటుంబం, స్నేహితులు శోకసంద్రంలో మునిగిపోయారు. మృతదేహాన్ని ఖతర్ నుంచి తీసుకురావడానికి ఎమ్మెల్యే, మంత్రుల సాయం కోరనున్నట్లు గ్రామంలోని యువకులు తెలిపారు.

నెల రోజుల్లో వస్తానంటివే...

అప్పులన్నీ తీరిపోయాయి. ఇంకో నెల రోజుల్లో జీతం తీసుకుని ఇంటికి వస్తానని ఫోన్‌లో చెబితివే. ఇంతలోనే ఇలాంటి వార్తను పంపావా. నీవు లేకుండా బతికేదెలా? నాకు, నాబిడ్డలకు ఇంక దిక్కెవరు? అంటూ మృతుడి భార్య షాబాజీ కన్నీరు మున్నీరయ్యారు.

ఏమీ కాలేదంటివి కద నాన్నా..!

అమ్మ నేనున్నాను. ఎలాంటి ఆందోళన వద్దు. నేను చూసుకుంటానని, ఫోన్‌లో కుమారుడు చెప్పిన మాటలు తలుచుకుంటూ తల్లి ఫరియాద్ బోరున విలపించారు. ఫోన్ చేసినప్పుడు కుమారుడి గొంతులోని తేడాను గుర్తించి ఏమైందిరా? అలా ఉన్నావని అడిగితే, ఏమీ కాలేదమ్మ, జ్వరం వస్తోందని, అయినా డ్యూటీకి వచ్చినట్లు చెప్పాడని ఆమె విలపించారు. ఆరోగ్యం బాగాలేనప్పుడు రెస్టు తీసుకోకూడదా అంటే నెలరోజుల్లో ఇంటికొస్తాను కదమ్మా, అంతో, ఇంతో కుటుంబ పోషణ కోసం డబ్బులు తెచ్చుకోవాలి కదా అందుకే డ్యూటీ చేస్తున్నట్లు చెప్పాడని బోరుమన్నారు.

జిల్లా పరీక్షల విభాగం ఏసీ బాధ్యతల స్వీకరణ



డీఈఓను కలిసిన నూతన ఏసీ వెంకటేష్

అనంతపురం విద్య, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్(ఏసీ)గా వెంకటేష్ బాధ్యతలు చేపట్టారు. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన సాధారణ బదిలీల్లో ఇక్కడ ఉన్న ఏసీ గోవిందనాయక్ కర్నూలు జిల్లాకు బదిలీకాగా, కడప జిల్లాలో పని చేస్తున్న ఏసీ వెంకటేష్‌ను అనంతపురం జిల్లాకు బదిలీ చేసిన విషయం తెలిసిందే. బదిలీ ఉత్తర్వులు నెల కిందటే వచ్చినా పరీక్షల నిర్వహణకు సంబంధించిన వివిధ రకాల బిల్లుల సబ్మిట్ చేయడానికి ఎక్కడవాళ్లు అక్కడ ఉండటానికి అవకాశం కల్పించారు. ఆ పక్రియ ముగియడంతో ప్రభుత్వ బదిలీ ఉత్తర్వుల మేరకు వెంకటేష్ శుక్రవారం జిల్లాకు వచ్చారు. డీఈఓ ప్రసాద్‌బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం జిల్లా విద్యాశాఖ ఏసీగా బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు విద్యాశాఖ సిబ్బంది, పలువురు హెచ్‌ఎంలు, ప్రైవేట్‌స్కూల్స్ కరస్పాండెంట్లు అభినందనలు తెలిపారు.

రేపు జిల్లా స్థాయి యోగాసన పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి యోగాసన చాంపియన్‌షిప్-2025 పోటీలు ఈనెల 3వతేదీన ఉరవకొండలో నిర్వహించనున్నట్లు జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రాజశేఖర్ రెడ్డి, రవికాంత్ రమణ తెలిపారు. 10-55 సంవత్సరాల వయస్సులోపు ఉన్న వారు అర్హులని అన్నారు. యోగాసనా భారత్ నిబంధనల ప్రకారం ఈ పోటీలలో గెలుపొందిన విజేతలు రాష్ట్రస్థాయి, ఖేలో ఇండియా యోగాసన పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన విజేతలు రాష్ట్ర స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్లు 9440288899, 9963028694లను సంప్రదించాలని తెలిపారు.

ఉత్తమ టీచర్ అవార్డుకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం విద్య, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురస్కరించుకొని సెప్టెంబరు 5న అందించే రాష్ట్ర స్థాయి ఉత్తమ టీచర్ల అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ ప్రసాద్‌బాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, ఎయిడెడ్, ఏపీఎంఎస్, ఏపీటీడబ్ల్యూఆర్ఈఎస్, ఏపీఆర్ఈఎస్, కేజీబీవీ, డైట్ స్కూళ్లలో పనిచేస్తున్న టీచర్లు, హెచ్‌ఎంలు ఇందుకు అర్హులని అన్నారు. 10 ఏళ్ల బోధన అనుభవం తప్పనిసరిగా ఉండాలన్నారు. రాష్ట్రస్థాయి అవార్డుకు దరఖాస్తు చేసేవారు జిల్లా అవార్డు పొంది ఉండాలన్నారు. గతంలో రాష్ట్రస్థాయి అవార్డు తీసుకున్నవారు మళ్లీ దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం లేదన్నారు. ఈనెల 12వ తేదీలోగా దరఖాస్తులను పూరించి జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అందజేయాలన్నారు.

ఎఫ్‌ఏ-1 పరీక్షల షెడ్యూల్‌లో మార్పు

అనంతపురం విద్య, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యా సంవత్సరంలో తొలిసారిగా జరగనున్న ఎఫ్ఏ-1 పరీక్షలు వాయిదా పడ్డాయి. గతంలో ఈనెల 4 నుంచి ఏడో తేదీవరకు ఈపరీక్షలు నిర్వహి స్తామని రాష్ట్ర విద్యాశాఖ నుంచి ఆదేశాలు వచ్చిన విషయం తెలిసిందే. అయితే పరీక్షలకు సంబంధించిన సామగ్రి సరఫరా కాకపోవడంతో ఎఫ్ఏ-1 పరీక్షల షెడ్యూల్‌ను మారుస్తూ శుక్రవారం ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టరు వెంకటకృష్ణారెడ్డి ఆదేశాలు జారీ చేసినట్లు డీఈఓ ప్రసాద్‌బాబు, డీసీఈబీ సెక్రటరీ గంధం శ్రీనివాసులు వెల్లడించారు. కొత్త షెడ్యూల్ ప్రకారం ఈనెల 11వ నుంచి 14వరకు ఎఫ్ఏ-1 పరీక్షలు నిర్వహిస్తామని వారు తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్, ఆశ్రమ పాఠశాలల యాజమాన్యాల ప్రధానోపాధ్యాయులు ఈ విషయాన్ని హెచ్‌ఎంలకు తెలియజేయాలని ఆదేశించారు.

జీడిపల్లికి పెరిగిన ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయరుకు ఇన్‌ఫ్లో పెరిగింది. శుక్రవారం 2156 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అవుట్‌ఫ్లో 2116 క్యూసెక్కులు ఉందన్నారు. ప్రస్తుతం రిజర్వాయరులో 1.773 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు వెల్లడించారు.

ఉమ్మడి జిల్లాకు వర్ష సూచన

బుక్కరాయసముద్రం,ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): రానున్న ఐదు రోజుల్లో ఉమ్మడి జిల్లాలో తేలిక పాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధనా కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త గుత్తానారాయణస్వామి తెలిపారు. గరిష్ఠ ఉష్ణోగ్రత 35.2-35.8డిగ్రీల సెల్సియస్‌గా కనిష్ఠ ఉష్ణోగ్రతలు 24.12-24.3 డిగ్రీల సెల్సియస్‌గా నమోదు కావచ్చని తెలిపారు. అనంతపురం జిల్లాలో 2న 0.3 మి.మీ, 3న 0.8 మి.మీ 4న 0.7 మి.మీ, 5న 0.2 మి.మీ 6న 5.6. మి.మీ వర్షం కురిసే అవకాశం ఉందన్నారు. శ్రీ సత్యసాయి జిల్లాలో 2న 2.2 మి.మీ, 3న 2.8 మి.మీ 4న 2.1 మి.మీ, 5న 3.9 మి.మీ 6న 10.2మి.మీ కురిసే అవకాశం ఉందన్నారు.

టీటీసీ సర్టిఫికెట్లు తీసికెళ్లండి: డీఈఓ

అనంతపురం విద్య, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): టీటీసీ(టెక్నికల్ టీచర్స్) సర్టిఫికెట్లు వచ్చాయని, సంబంధిత అభ్యర్థులు వచ్చి తీసుకెళ్లాలని డీఈఓ ప్రసాద్ బాబు శుక్రవారం ఓప్రకటనలో తెలిపారు. టీటీసీ -2024కి సంబంధించి డ్రాయింట్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ లోయర్ గ్రేడ్ టెక్నికల్ పరీక్షలు గతేడాది ఆగస్టులో జరిగాయన్నారు. ఈ పరీక్షలు రాసి, ఉత్తీర్ణులైన అభ్యర్థులకు సర్టిఫికెట్లు వచ్చాయన్నారు. అభ్యర్థులు హాల్‌టిక్కెట్, ఆధార్‌కార్డు తీసుకొని వచ్చి జిల్లాకార్యాలయంలో ఉన్న టీటీసీ సర్టిఫికెట్లు తీసుకెళ్లాలని సూచించారు.

టమోటాలు కిలో రూ.34

అనంతపురంరూరల్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో శుక్రవారం కిలో టామోటాలు గరిష్టంగా రూ.34తో అమ్ముడుపోయాయి. అదే విధంగా కనిష్ఠంగా రూ.24, సరసరిగా రూ.28తో విక్రయాలు జరిగాయి. మార్కెట్‌కు మొత్తంగా 3,600 టన్నుల టమోటాలు వచ్చాయని రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు.

చీనీ టన్ను రూ.14వేలు

అనంతపురంరూరల్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 14వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.4వేలు, సరాసరి ధర రూ.10,100 పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 1221 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

తొలి అడుగు వందశాతం పూర్తి: ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం క్రైం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): అనంతపురం అర్బన్‌లో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని వందశాతం పూర్తి చేశామని, అందులో భాగంగా లక్షకు పైగా గడపల తలుపులను తట్టి ప్రజలను ఆత్మీయంగా పలకరించగలిగామని ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్ అన్నారు. అనంతపురం పార్లమెంట్‌లోనే అనంతపురం అర్బన్ నియోజకవర్గం తొలిస్థానంలో నిలిచిందని శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. తనతోపాటు టీడీపీ కార్యకర్తలు, నాయకులు నియోజకవర్గంలోని 1,01,010 ఇళ్ల వద్దకు వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం చేసిన సంక్షేమ పథకాలను వివరించారన్నారు. పార్టీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ పథకాన్ని క్షేత్రస్థాయి వరకూ తీసుకెళ్లి విజయవంతం చేశామన్నారు. భవిష్యత్తులో కూడా ప్రజలకు మరింత మంచి చేసేలా పనిచేస్తామని ఆయన పేర్కొన్నారు.

బిడ్డకు తల్లిపాలే శ్రేష్ఠం: సీడీపీఓ

శింగనమల, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): బిడ్డకు తల్లిపాలే శ్రేష్ఠమని ఐసీడీఎస్ సీడీపీఓ లలితమ్మ సూచించారు. తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని మండలకేంద్రంలోని అంగన్వాడీ కేంద్రాల సిబ్బంది చిన్నారులు, బాలింతలు, గర్భిణులతో కలిసి శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీడీపీఓ మాట్లాడుతూ.. బిడ్డకు తల్లిపాలే శ్రేష్ఠమన్నారు. అందులోనే పోషకాలు అధికంగా ఉంటాయని, వాటిని తాపితే బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. పుట్టిన బిడ్డలకు ముర్రుపాలు తాపాలని సూచించారు. సుపవైజర్ కల్పన, అంగన్వాడీ కార్యకర్తలు గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

●నార్పల: మండలంలోని హెచ్ సోదనపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. పప్పూరు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సునీత, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

●అనంతపురం వైద్యం: నగరంలోని శ్రీనివాస్‌నగర్‌లో గల ఐసీడీఎస్ థర్డ్‌సెక్టార్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, అంగన్‌వాడీ వర్కర్లు తల్లిపాల వారోత్సవాలపై ర్యాలీ నిర్వహించారు. బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

సీపీఐ రాప్తాడు నియోజకవర్గ కార్యదర్శిగా రమేష్


రమేష్ నరేష్

అనంతపురంరూరల్, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి):సీపీఐ రాప్తాడు నియోజకవర్గ కార్యదర్శిగా మండల కార్యదర్శిగా పనిచేసిన రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలోని కందుకూరు గ్రామంలో శుక్రవారం జరిగిన రాప్తాడు నియోజకవర్గం 6వ మహాసభలో నిర్వహించిన డెలిగేట్స్ సమావేశంలో రాప్తాడు నియోజకవర్గ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అందులో కార్యదర్శిగా ఎం.రమేష్, సహాయ కార్యదర్శిగా నీళ్ల పాల రామకృష్ణతోపాటు మరో 19మంది కార్యవర్గ సభ్యులుగా, 33మందిని కౌన్సిల్ సభ్యులుగా ఎన్నిక చేశారు. అదేవిధంగా మండల కార్యదర్శిగా నరేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈయన గత మూడేళ్లుగా మండల సహాయకార్యదర్శిగా పని చేశారు.

నేడు ఎమ్మెల్యే పరిటాల సునీత పర్యటన

కనగానపల్లి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే పరిటాల సునీత శనివారం కనగానపల్లి మండలకేంద్రంలో పర్యటించనున్నారని టీడీపీ మండల కన్వీనర్ యాతం పోతలయ్య, మార్కెట్‌యార్డ్ చైర్మన్ సుధాకర్‌చౌదరి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. స్థానిక ఏఓ కార్యాలయం వద్ద నిర్వహించే అన్నదాత సుఖీభవ ప్రారంభంలో ఆమె పాల్గొంటారని చెప్పారు.

శింగనమలలో బండారు శ్రావణిశ్రీ..

శింగనమల: మండలకేంద్రంలో శనివారం నిర్వహించే అన్నదాత సుఖీభవ ప్రారంభానికి ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ రానున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ గుత్తి ఆదినారాయణ, ఏఓ అన్వేష్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో అన్నదాత సుఖీభవను ప్రారంభిస్తారన్నారు. ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, ఏడీసీసీబీ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గుర్రం లక్ష్మీనారాయణ హాజరు కానున్నట్లు చెప్పారు. మండల అధికారులు, రైతులు, టీడీపీ శ్రేణులు హాజరు కావాలని కోరారు.

జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో సత్తా


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

రాప్తాడు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పంగల్ రోడ్డు సమీపంలో గల విన్సెంట్ డీపాల్ పాఠశాల విద్యార్థులు బండారు నితీష, మనీష్ నందన్‌లు జాతీయ స్థాయి తైక్వాండో పో టీలలో ప్రతిభ కనబర్చి రజత పథకాలు సాధించారు. ఇటీవల విజయవాడలో జరిగిన 10వ జాతీయ ఓపెన్ తైక్వాండో ఛాంపియన్‌షిప్-2025 పోటీల్లో ఆ విద్యార్థులు పాల్గొని సత్తా చాటారు. దీంతో ఆ విద్యార్థులను శుక్రవారం ప్రిన్సిపాల్ మేరీ, ఉపాధ్యాయులు అభినందించారు.

5న ఆందోళనలో పాల్గొనండి: ఏఐవైఎఫ్

గార్లదిన్నె, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో ఈనెల 5వ తేదీన ఆందోళనలు చేపట్టనున్నామని, ఇందులో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు శ్రీనాథ్‌చౌదరి పిలుపునిచ్చారు. మండలకేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పం దించి స్మార్ట్ మీటర్ల ఏర్పాటును తక్షణమే ఉపసంహరించుకోవాలని డి మాండ్ చేశారు. లేదంటే పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

మహిళ ఆత్మహత్య

రామగిరి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని నసనకోట గ్రామంలో ఓ మహిళ శుక్రవారం క్రిమిసంహారక మందు సేవించి ఆత్మహత్యకు చేసుకుంది. గ్రామానికి చెందిన పూజారి శిరీష(27) మూడు రోజుల క్రితం క్రిమిసంహారిక మందు సేవించింది. గమనించిన కుటుంబ సభ్యులు అనంతపురం ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో బెంగుళూరుకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్సలు పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఆమెకు భర్త మదనమోహన్, ఇద్దరు పిల్లలున్నారు. అత్త, కోడలు వాదించుకోవడంతో మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం.

ఇన్సూరెన్స్ ప్రీమియం బాండ్లు పంపిణీ

అనంతపురం రూరల్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని రుద్రంపేటలో ఎంఎస్ఎస్ సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన పథకం కింద ఇన్సూరెన్స్ ప్రీమియం బాండ్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా సంస్థ అధ్యక్షుడు సాధిక్‌వలి మాట్లాడుతూ.. ఇటీవల సంస్థ ఆధ్వర్యంలో రుద్రంపేట పంచాయతీలోని ప్రతి కుటుంబంలోని ఒక్కరికి ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన పథకం కింద ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించామన్నారు. రెండో విడతలో భాగంగా ఈ బీమా యోజన కింద 18 నుంచి 50ఏళ్ల లోపు వయసు వారికి ప్రీమియం చెల్లిస్తామన్నారు. మూడో విడతలో అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. అదేవిధంగా పంచాయతీలో సంస్థ ఆధ్వర్యంలో బీమా చేయించుకున్న వారు ఎవరైనా మరణిస్తే వారికి రూ.5వేలు తక్షణ సాయం అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు మాహబూబ్‌బీ, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.



బీమా బాండ్లు పంపిణీ చేస్తున్న సంస్థ సభ్యులు

కానిస్టేబుల్ ఫలితాల్లో రైతు బిడ్డల సత్తా


చిత్రారామ్మోహన్ (రాప్తాడు), తలారి దేవేంద్ర ప్రసాద్ (రాప్తాడు), పోలా రవీంద్ర (గంగలకుంట), మల్లెల నవీన్‌కుమార్ (మామిళ్లపల్లి), పులిరాజు మహేష్ (నార్పల), శివారెడ్డి (నార్పల), శ్రావణి సంధ్య (నాయనపల్లి), నరేంద్రకుమార్ (నాయనపల్లి), ఈడిగ పవన్ (నార్పల), మనోరంజన్ (నాయనపల్లి)


కిశోర్ కుమార్ (శింగనమల), శ్రీలక్ష్మి (శింగనమల), దండు ఉమాదేవి (పెద్ద మట్లగొంది), రాజేశ్వరి (చిన్నజలాలపురం), బండి నరేష్ (చిన్నజలాలపురం), రాజ్‌కుమార్ (చిన్నజలాలపురం), చిన్నవెంకటేశ్‌నాయక్ (నాగులగుడ్డంతండా), జపాల శ్రీధర్ నాయక్ (నాగులగుడ్డంతండా), మమత (న్యామద్దల), శ్రీవాణి (న్యామద్దల), అశ్వర్థనారాయణ (న్యామద్దల)

రాప్తాడు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): పోలీస్ కానిస్టేబుల్ ఫలితాల్లో రైతు బిడ్డలు సత్తా చాటారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శుక్రవారం కానిస్టేబుల్ రాత పరీక్షల ఫలితాలను విడుదల చేసింది. ఇందులో రాప్తాడు మండల కేంద్రానికి చెందిన చిత్రా రామ్మోహన్, తలారి దేవేంద్ర ప్రసాద్, గంగలకుంట గ్రామానికి చెందిన పోలా రవీంద్ర సత్తా చాటి ఉద్యోగం సాధించారు. వ్యవసాయ కుటుంబాలకు చెందిన వీరు ఉద్యోగాలకు ఎంపిక కావడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

●రామగిరి: మండలంలో వ్యవసాయ కుటుంబానికి చెందిన ఐదుగురు యువకులు కానిస్టేబుళ్లకు ఎంపికయ్యారు. సజ్జెంపల్లికి చెందిన కమతం సతీశ్, శేషంపల్లికి చెందిన కోరే వసంత, పోలేపల్లికి చెందిన మద్దెల సునీత, ఏడుగుర్రాలపల్లికి చెందిన హరియన్‌చెరువు నాగేంద్రబాబు, బాసి అమృత ఎంపికయ్యారు.

●కనగానపల్లి: మండలానికి చెందిన నలుగురు యువకులు, ఒక యువతి కానిస్టేబుల్ ఉద్యోగాలకు అర్హత సాధించారు. కొండపల్లికి చెందిన వడ్డే ఈశ్వరయ్య, మమత, కనగానపల్లికి చెందిన సాకే పోతులరాజు, మామిళ్లపల్లికి చెందిన అంజన్‌రెడ్డి, మల్లెల నవీన్‌కుమార్ సత్తా చాటి కానిస్టేబుల్ ఉద్యోగాలు పొందారు.

●నార్పల: మండలానికి చెందిన ఆరుగురు పేదింటి, రైతు కుటుంబాల బిడ్డలు కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపియ్యారు. నార్పలకు చెందిన పులిరాజు మహేష్, శివారెడ్డి, ఈడిగ పవన్, నాయనపల్లికి చెందిన శ్రావణి సంధ్య, నరేంద్ర కుమార్, మనోనిరంజన్ కానిస్టేబుల్ ఉద్యోగాలు పొందారు.

●శింగనమల: మండలంలో 8 మంది కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. అందులో ఏడుగురు వ్యవసాయ కుటుంబాలకు చెందిన వారు కావడం విశేషం. శింగనమల మండలకేంద్రానికి చెందిన ముంత కిశోర్‌కుమార్, భూమిరెడ్డి శ్రీలక్ష్మి, చిన్నజలాలపురానికి చెందిన మెండిపోగుల రాజేశ్వరి, ఎస్.రాజ్‌కుమార్, బండి నరేష్, పెద్ద మట్లగొంది గ్రామానికి చెందిన దండు ఉమాదేవి, నాగులగుడ్డం తండాకు చెందిన జపాల శ్రీధర్‌నాయక్ సివిల్ కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపియ్యారు. అలాగే ఏపీఎస్పీ కానిస్టేబుల్ ఉద్యోగానికి నాగులగుడ్డంతండాకు చెందిన చిన్నవెంకటేశ్ నాయక్ ఎంపికయ్యాడు.

●చెన్నేకొత్తపల్లి :పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాలకు రైతు, చేనేత కుటుంబాలకు చెందిన యువతీయువకులు ఎంపికయ్యారు. మండలంలోని న్యామద్దల గ్రామానికి చెందిన కమతం మమత, పి.వాణి, దాసరి అశ్వర్థనారాయణలు ఈ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఒకే గామానికి చెందిన ముగ్గురు పోలీసు ఉద్యోగాలకు ఎంపిక కావడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

ఎంఈఓల నియామకంలో వివక్ష తగదు: పీఆర్‌టీయూ

అనంతపురం విద్య, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఇన్‌చార్జి ఎంఈఓల నియామకంలో వివక్ష తగదని పీఆర్‌టీయూ, ఆపస్ ఉపాధ్యాయ సంఘాల నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు విష్ణువర్ధనరెడ్డి, చంద్రశేఖరరెడ్డి, ఆపస్ అధ్యక్షుడు ఎర్రిస్వామి శుక్రవారం జిల్లాకేంద్రంలో డీఈఓ ప్రసాద్‌బాబును కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ, పంచాయతీరాజ్ టీచర్ల ఉమ్మడి సర్వీస్‌ను పరిగణలోకి తీసుకొని ఎంఈఓల నియామకం చేపట్టాలని ఏళ్లుగా కోరుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఇపుడు ఎంఈఓల ఖాళీల నియామకాల విషయంలో విద్యాశాఖ ఉన్నతాధికారులు గవర్నమెంట్ మేనేజ్‌మెంట్ టీచర్లకే కేటాయించడం అన్యాయమన్నారు. వెంటనే ఈ ఎంఈఓల నియామకాలు రద్దుచేసి పునఃపరిశీలన చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రాజేంద్రప్రసాద్, తిమ్మారెడ్డి, రామన్న, వీఎస్‌పీ నాయుడు, రమేష్,వరదరాజులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాల కోసం పోరాడతాం: సీపీఐ

రాప్తాడు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకు ఇంటి స్థలాలు, ఇళ్లు మంజూరు కోసం పోరాటం చేస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రామకృష్ణ తెలిపారు. మండలకేంద్రంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం హంద్రీనీవా, పీఏబీఆర్ ఆయకట్టు ఏర్పాటు చేసి పిల్ల కాలువల ద్వారా పొలాలకు నీరివ్వాలన్నారు. మండల కేంద్రంలో మార్కెట్ యార్డు నిర్మించాలన్నారు. నియోజకవర్గ కేంద్రమైన రాప్తాడులో డిగ్రీ, జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: టీడీపీ

గార్లదిన్నె, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. మండలంలోని 16 సచివాలయాల పరిధిలో 120 వితంతువులకు నూతనంగా పింఛన్లు మంజూరయ్యాయి. వాటిని నాయకులు అధికారులతో కలిసి శుక్రవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మండలకేంద్రంలో పంపిణీ అనంతరం నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగలేకపోయినా ప్రజా సంక్షేమం కోసం సీఎం చంద్రబాబు తీవ్ర కృషి చేస్తున్నారని అన్నారు. అందులో భాగంగానే నూతన పింఛన్లు మంజూరు చేశారని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు ఆవులక్రిష్ణయ్య, జడ్పీటీసీ మాజీ సభ్యుడు గుర్రం ఆదినారాయణ, నాయకులు గేటుక్రిష్టారెడ్డి, పాండు, గుత్తాబాలకృష్ణ, ఎంపీడీఓ యోగానందరెడ్డి, పంచాయతీ కార్యదర్శి ముత్యాల్‌రెడ్డి పాల్గొన్నారు.

●నార్పల: మండలంలోని బొందలవాడ గ్రామంలో టీడీపీ జిల్లా నాయకుడు ఆలం వెంకట నరసానాయుడు నూతనంగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, వార్డు మెంబర్ నారాయణస్వామి పాల్గొన్నారు.

●రామగిరి: మండలవ్యాప్తంగా 68 వితంతు పింఛన్లు నూతనంగా మంజూరయ్యాయి. వాటిని టీడీపీ నాయకులు, అధికారులు కలిసి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మండల కేంద్రంలోనే 15 మందికి పంపిణీ చేశారు. నాయకులు పరంధామయాదవ్, విశ్వనాథ్, శ్రీరాములు నాయక్, నాగేశ్‌నాయుడు, పేపర్‌శీన, క్రాంతి, గంగిరెడ్డి, పంచాయతీ సెక్రటరీ ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

●రాప్తాడు: మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో వితంతు, ఒంటరి మహిళలకు 85 నూతన పింఛన్లు మంజూరయ్యాయి. వాటిని టీడీపీ నాయకులు, అధికారులు లబ్ధిదారులకు ఇళ్ల వద్దకు వెళ్లి పంపిణీ చేశారు. మండలకేంద్రంలో ఎంపీడీఓ విజయలక్ష్మి , టీడీపీ మండల కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, సర్పంచ్ తిరుపాలు, మాజీ కన్వీనర్ నారాయణస్వామి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ కిష్టా, పంపిణీ చేశారు. మరూరులో సహకార సొసైటీ చైర్మన్ గోపాల్, కేశవ తదితరులు పంపిణీ చేశారు.

3వ ఏపీపీ బాధ్యతల స్వీకరణ


డీడీ రామ్ నాయక్‌ని కలిసిన నారాయణ

అనంతపురం క్రైం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి) : మూడో అదనపు జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా న్యాయవాది నారాయణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవలే ఆయన మూడో అదనపు జిల్లా కోర్టు పీపీగా నియమితులు కాగా బాధ్యతలు తీసుకున్నారు. అంతకు ముందు ప్రాసిక్యూషన్ డిప్యూటీ డైరెక్టర్ రామ్‌నాయక్, జిల్లా ప్రధాన న్యాయాధికారి భీమారావును మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం మాట్లాడుతూ.. నిందితులకు శిక్షణ పడేలా బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ధర్మసింగ్ నాయక్, న్యాయవాదులు పాల్గొన్నారు.

మిగులు సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

గార్లదిన్నె, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని మైనార్టీ ఆంగ్ల మాధ్యమ రెసిడెన్షియల్ పాఠశాలలో మిగులు సీట్లకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ ఆంజనేయులు నాయక్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. 5, 6, 7, 8వ తరగతులలో 34 మిగులు సీట్లు ఉన్నాయన్నారు. 5వ తరగతిలో 24 సీట్లు, 6లో 2, 7లో 4, 8లో 4 సీట్లు ఉన్నాయన్నారు. అర్హులైన ముస్లిం, దుదేకుల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. మరిన్ని వివరాలకు 8712625062ను సంప్రదించాలని కోరారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకే విమర్శలు: టీడీపీ

చెన్నేకొత్తపల్లి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సీఎం చంద్రబాబు, రాప్తాడు నియోజకవర్గంలో ఎమ్మెల్యే పరిటాల సునీత చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి లేనిపోని విమర్శలు చేశారని టీడీపీ మండల కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ అంకే అమరేంద్ర అన్నారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మూడు రోజుల క్రితం రాప్తాడులో ప్రకాశ్‌రెడ్డి మీటింగ్ పెట్టి ఏమి మాట్లాడాలో తెలియక ప్రభుత్వంపై, పరిటాలకుటుంబంపై విమర్శలు చేశారన్నారు. కేవలం విమర్శలు చేయడానికే ఆ మీటింగ్ పెట్టినట్లు ఉందన్నారు. ప్రకాశ్‌రెడ్డి, ఆయన సోదరులు అధికారంలో ఉన్నంత కాలం దౌర్జన్యాలు చేయడానికి, దోచుకోవడానికే సమయం సరిపోయింద న్నారు. కనీసం సొంతూరుకు రోడ్డు వేయించలేకపోయారన్నారు. ఇప్పుడు పరిటాల కుటుంబంపై విమర్శలు చేయడం దయ్యాలువేదాలు వల్లించినట్లుగా ఉందన్నారు. ఇప్పటికైనా లేనిపోని విమర్శలు చేయడాన్ని మానుకోవాలని హితవుపలికారు. సమావేశంలో నాయకులు చెన్నకేశవుల గౌడ్, నాగరాజు, ఓబిరెడ్డి, ఉత్తర కుమారరెడ్డి, మహేశ్, ఆదినారాయణరెడ్డి, నరసింహులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రావణ శుక్రవార పూజలు


ప్రత్యేకాలంకరణలో సీతమ్మ

అనంతపురం టౌన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : శ్రావణమాసం రెండో శుక్రవారాన్ని పురస్కరించుకుని నగరంలోని వివిధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు వైభవంగా జరిగాయి. మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయాలకు చేరుకుని శ్రావణ లక్ష్మిని పూజించి ఆహ్వానించారు. ఈ నేపథ్యంలో సోమనాథ్ నగర్ రామాలయంలో సీతమ్మతల్లిని కొలువుదీర్చి గాజులతో విశేషంగా అలంకరించారు. అలాగే సామూహిక లలితాసహస్రనామ పారాయణాలు పఠించారు.

జగన్‌కు జైలు బాట తప్పదు

- ప్రకాష్‌రెడ్డికి నిద్రలో కూడా రవి గుర్తుకొస్తున్నారు
- ఎమ్మెల్యే పరిటాల సునీత మండిపాటు


పింఛన్ అందుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే తదితరులు

అనంతపురం రూరల్,ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): జగన్‌రెడ్డికి త్వరలోనే జైలుబాట తప్పదని, సూట్‌కేస్ సర్దుకుని రెడీగా ఉండాలని ఎమ్మెల్యే పరిటాల సునీత హెచ్చరించారు. మండలంలోని పాపంపేట గ్రామంలో శుక్రవారం ఆమె ఆర్డీఓ కేశవనాయుడు, టీడీపీ నాయకులతో కలిసి పింఛన్ల పంపిణీ చేపట్టారు. స్థానిక రామాలయం వీధిలో ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. కొత్తగా మంజూరైన వారికి కూడా పంపిణీ చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ప్రతినెలా 42వేలమందికి పింఛన్లు పంపిణీ చేస్తున్నామన్నారు. ఇప్పుడు కొత్తగా 631పింఛన్లు మంజూరైనట్లు చెప్పారు. సీఎం చంద్రబాబును బావిలో దూకమని జగన్ అంటున్నారని, మా నాయకుడు కాదు నీళ్లులేని బావిలో ఆయనే దూకాలని అన్నారు. అయినా చేసిన పాపాలు పోవన్నారు. త్వరలోనే జగన్‌కు జైలు బాట తప్పదని, అందుకు సిద్ధం కావాలని సూచించారు. ఇదే సందర్భంలో మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి రెండు రోజుల కిందట చేసిన వ్యాఖ్యలపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఆయన ఏ సమావేశం నిర్వహించినా పరిటాల రవి పేరు తలచుకోకుండా ఉండలేరన్నారు. తోపుదుర్తి సోదరులకు పరిటాల రవి నిద్రలో కూడా గుర్తుకొచ్చి వణుకుపుట్టిస్తున్నారన్నారు. పరిటాల రవి హత్యలు చేశారని నిత్యం ప్రచారం చేసే మీరు గత ఐదేళ్లలో అధికారంలో ఉండి కూడా ఎందుకు విచారణ చేసి నిజాలు నిగ్గుతేల్చలేదని నిలదీశారు. గతంలో కారుబాంబు పెట్టి పలువురి అమాయకులను పొట్టన పెట్టుకున్న దుర్మార్గులు మీరేనంటూ మండిపడ్డారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దివాకర్, డిప్యూటీ ఎంపీడీఓ వెంకట నాయుడు, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌బాబు, టీడీపీ మండల కన్వీనర్ జింకాసూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి షెక్షావలినాయుడు, మాజీజడ్పీటీసీ వేణుగోపాల్, క్లస్టర్ ఇన్‌చార్జులు పాముురాయి రఘు, చల్లాజయకృష్ణ, నాయకులు తాడాల నాగభూషణం, రామాంజనేయులు, లింగమయ్య, పేరంహరి, గోవిందు, శ్రీరాములు,రత్నమోహన్ బాబావలి, సాంబశివ, చిరంజీవి, దస్తగిరి, హరీష్‌రెడ్డి, జెట్టి భరత్,రాము, సైఫుల్లాఖాన్, లక్ష్మీదేవి, సాలమ్మ, రామాంజినమ్మ, శ్వేత, అక్కమ్మ తదితరులు పాల్గొన్నారు.

95.22శాతం పింఛన్ల పంపిణీ


పింఛన్ పంపిణీలో నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): నగరంలో శుక్రవారం 95.22 శాతం పింఛన్లను పంపిణీ చేశారు. నగరపాలక సంస్థలోని 74వార్డు సచివాలయాల పరిధిలో 22,668 పింఛన్లు ఉన్నాయి. ఆగస్టు నెలకు సంబంధించి ఉద్యోగులు ఉదయం 7గంటల నుంచి పింఛన్ల పంపిణీ ప్రారంభించారు. సాయంత్రానికి 21,584మందికి పింఛన్లు పంపిణీ చేసి 95.22శాతం పూర్తి చేశారు. ఇంకా 1084మందికి పంపిణీ చేయాల్సి ఉంది. ఎక్కడా ఎటువంటి సమస్య లేకుండా పింఛన్ల పంపిణీ సజావుగా సాగిందని నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి తెలిపారు. వార్డు సచివాలయ ఉద్యోగులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

చీఫ్ ఫార్మసీ ఆఫీసర్ ఎవరు..?


ఖాళీగా ఉన్న చీఫ్ ఫార్మసీ ఆఫీసర్ కుర్చీ

అనంతపురం వైద్యం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సర్వజన వైద్య శాలలోని ఫార్మసీ విభాగా నికి చీఫ్ ఫార్మసీ ఎవరన్న చర్చ జోరుగా సాగుతోంది. ఇక్కడ పనిచేస్తున్న ఈశ్వర్ రెడ్డి గతనెల 31న రిటైర్డ్ అయ్యారు. ఆయన శుక్రవారం కార్యాలయానికి వచ్చి విధుల నిర్వహణ బాధ్యతల నుంచి తప్పుకున్నారని ఆసుపత్రి వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో చీఫ్ ఫార్మసీ ఆఫీసర్ ఇన్‌చార్జి బాధ్యతలు ఎవరికి అప్పగిస్తారోనని ఉద్యోగవర్గాలు ఎదురు చూస్తున్నాయి. ఆసుపత్రిలోని ఫార్మసీలో మెయిన్ స్టోర్, ఐపీ స్టోర్, సర్జికల్ స్టోర్, ఓపీడీ డిస్పెన్సరీ ఇలా నాలుగున్నాయి. వీటన్నింటినీ పర్యవేక్షించేలా ఒక చీఫ్ ఫార్మసీ ఆఫీసర్ ఉంటారు. మెయిన్ స్టోర్‌లో సురేష్, ఆచారి, నారాయణ మూర్తి. ఐపీ స్టోర్‌లో అరుణమ్మ, భారతి. సర్జికల్ స్టోర్‌లో మౌనికా పాల్. ఓపీడీ డిస్పెన్సరీలో కుళ్లాయిబాబు, నందభాస్కర్, నరేంద్ర ప్రసాద్, రమణశ్రీ, కృష్ణవేణి మొత్తం 11మంది ఫార్మసీ ఆఫీసర్లుగా పని చేస్తున్నారు. వీరికి అదనంగా కాంట్రాక్ట్ పద్ధతిలో కొంతమంది పనిచేస్తున్నారు. ఫార్మసీ ఆఫీసర్లలో సీనియర్‌లకు కాకుండా జూనియర్లకు ఇన్‌చార్జి బాధ్యతలు కట్టబెట్టేలా రాజకీయం నడుస్తోందని ఆసుపత్రి వర్గాలు చర్చించుకుంటున్నాయి. ఈ నేపథ్యంలోనే చీఫ్ ఫార్మసీ ఆఫీసర్ ఎవరన్న చర్చ సాగుతోందని పేర్కొంటున్నాయి. అయితే ఆస్పత్రి సూపరింటెండెంట్ విజయవాడకు వెళ్లడంతో శుక్రవారం వాయిదా పడింది. పారదర్శకంగా బాధ్యలప్పగిస్తారా? రాజకీయం చేసేవారికే కట్టబెడతారా? అన్నది శనివారం తెలుస్తుందని ప్రచారం సాగుతోంది.

జనాదరణను చూసి ఓర్వలేకే ఆంక్షలు: మేయర్

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ పర్యటనలకు వస్తున్న జనాదరణను చూసి ఓర్వలేకనే కూటమి నేతలు పోలీసుల ద్వారా ఆంక్షలు విధిస్తున్నారని నగర మేయర్ మహమ్మద్ వసీం విమర్శించారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అక్రమ కేసులు బనాయించే ప్రయత్నం చేస్తుండటం ద్వారా కూటమి నేతల్లో భయం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. జగన్ ప్రజానేత అని, ఆంక్షలు, లాఠీలు ఆయన్ను ఆపలేవని అన్నారు. కూటమి నేతలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు.

పేద విద్యార్థులకు సీట్లు కేటాయించాలని వినతి

అనంతపురంరూరల్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి):ఉమ్మడి జిల్లాలోని దళిత పేద విద్యార్థులకు బీఆర్ అంబేడ్కర్ విద్యాలయాల్లో సీట్లు కేటాయించి న్యాయం చేయాలని ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లా అధ్యక్షుడు రమణ కోరారు. ఈమేరకు నగరంలో శుక్రవారం ఆ విద్యాలయాల జిల్లా కోఆర్డినేటర్‌ను కలిసి వినతి పత్రం ఇచ్చారు. నాయకులు చిన్నపెద్దన్న, నాగభూషణం, విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

నేడు ఫ్యాప్టో ధర్నా

అనంతపురం విద్య, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): విద్యారంగ, టీచర్ల సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ వద్ద శనివారం పెద్దఎత్తున టీచర్లతో కలిసి ధర్నా చేపడుతున్నట్లు ఫ్యాప్టో నేతలు శ్రీనివాస నాయక్, రమణారెడ్డి, పురుషోత్తంరెడ్డి, సిరాజుద్దీన్, వెంకటరత్నం శుక్రవారం ప్రకటనలో తెలిపారు. అనేక సమస్యలతో టీచర్లు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వీటిని పరిష్కరించాలని కోరుతున్నా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. పైగా విద్యాశాఖ ఉన్నతాధికారులు రోజుకొక అసంబద్ధ నిర్ణయాలు తీసుకుంటూ ఉపాధ్యాయులను మరింత మానసిక వేదనకు గురి చేస్తున్నారని వాపోయారు. వీటిని వ్యతిరేకిస్తూ రాష్ట్రకమిటీ పిలుపు మేరకు శనివారం ధర్నా కొనసాగిస్తున్నామని అన్నారు. టీచర్లు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

విద్యుత్ శాఖ ఏఏఓకు ఘన సన్మానం


గంగన్న దంపతులను సత్కరిస్తున్న విద్యుత్‌శాఖ సిబ్బంది, బంధువులు

అనంతపురం టౌన్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖలో గత 34 సంవత్సరాలుగా వివిధ హోదాల్లో విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ పొందిన ఏఏఓ ములక గంగనకు జేఎన్టీయూ క్యాంపస్ ఆడిటోరియంలో శుక్రవారం ఘన సన్మానం చేశారు. తోటి ఉద్యోగులు, అధికారులు, సిబ్బంది ఆయన్ను, ఆయన సతీమణిని పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. అనంతరం విద్యుత్‌శాఖ పుట్టపర్తి ఎస్ఈ సంపత్‌కుమార్ మాట్లాడుతూ.. గంగన్న విద్యుత్‌శాఖకు చేసిన సేవలు మరవలేనివన్నారు. సహోద్యోగులతో కలివిడిగా ఉంటూ, ఎవరితోనూ ఎలాంటి విభేదాలకు తావు లేకుండా నిబద్ధతతో విధులు నిర్వర్తించారని కొనియాడారు. ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ అధ్యక్షుడుగానూ తనదైన ముద్ర వేసుకున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో తిరుపతి ఎస్ఈ డాక్టర్ శైలజానాథ్ గంగన్న కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న జలకన్య ఎగ్జిబిషన్

అనంతపురం టౌన్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): నగరంలోని రుద్రంపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పక్కన ఏర్పాటు చేసిన జలకన్య ఎగ్జిబిషన్ ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంటోంది. జిల్లాలో మొట్టమొదటిసారి ఏర్పాటు చేసిన జలకన్య ఎగ్జిబిషన్‌లో స్పెషల్ సునామి రైడ్, బిగ్ జెయింట్‌వీల్, కొలంబస్, బ్రేక్‌డ్యాన్స్ మారీ గ్రౌండ్, వాటర్ బోట్, సన్‌మూన్ బేబీ ట్రైన్, బేబీ బైక్‌రైడ్, షాపింగ్ ఇలా ఎన్నో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఎగ్జిబిషన్ ప్రతిరోజు సాయంత్రం 4:30 నుంచి రాత్రి9:30 గంటల వరకు ఓపెన్‌లో ఉంటుందని నిర్వాహకుడు శ్రీనివాసులు శుక్రవారం విలేకరులకు తెలిపారు. ప్రజల నుంచి ఎగ్జిబిషన్‌కు విశేష స్పందన లభిస్తోందన్నారు. పిల్లలు, పెద్దలు అందరికీ ఆనందం పంచేలా జలకన్య ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశామన్నారు. మరో నెలరోజులపాటు ఉంటుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



ఎగ్జిబిషన్ వద్ద ప్రజల సందడి

పెట్రేగుతున్న మట్టి మాఫియా

- కరిగిపోతున్న కొండలు
- ట్రిప్పునకు రూ.900 నుంచి 1200 వసూలు
- చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు

విడపనకల్లు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మండలంలో మట్టి మాఫియా చెలరేగిపోతోంది. పగలు, రాత్రి అన్న తేడా లేకుండా కొండలను తవ్వేస్తున్నారు. స్థానిక మోడల్ స్కూల్ వద్ద ఉన్న కొండ, గ్రామానికి ఆనుకుని ఉన్న పెద్ద కొండ, తిమ్మప్ప కొండ, గడేకల్లు లోని చౌడమ్మకొండను యదేచ్ఛగా తవ్వేస్తున్నారు. పట్టపగలే 10 నుంచి 15 ట్రాక్టర్లు ఏర్పాటు చేసి, రెండు ఎక్స్‌కవేటర్ల సాయంతో మట్టిని తోడేస్తున్నారు. ట్రాక్టర్ మట్టిని రూ.900 నుంచి రూ.1200లకు విక్రయించి సొమ్ము చేసుకుంటు న్నారు. వైసీపీ, టీడీపీ నాయకులు కుమ్మక్కై ఈ మట్టిని తవ్వేస్తున్నా రెవెన్యూ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. వారం రోజుల కిందట ఈ మట్టి మాఫియాపై తహసీల్దారు కార్యాలయంలో సీపీఐ నాయకులు ఫిర్యాదు చేశారు. అయినా అధికారుల్లో చలనం లేదు. ఎర్రితాత తిప్ప వద్ద (కొండ)ఎస్సీలకు ప్రభుత్వం భూములను పంపిణీ చేసింది. ఈ అసైన్డ్ భూములను మండల కేంద్రానికి చెందిన కొందరు ఎర్ర మట్టి తవ్వకాల కోసం ఎకరా రూ. ఆరేడు లక్షలకు విక్రయించారు. అయితే ప్రభుత్వ భూమిలోని మట్టిని తవ్వరాదంటూ రెవెన్యూ కార్యాలయంలో పని చేసే కొందరు అడ్డుచెప్పారు. తర్వాత మట్టి మాఫియాతో ట్రిప్పునకు ఇంత చెల్లించాలని ఒప్పందం కుదుర్చుకుని, సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కర్ణాటక రాష్ట్రానికి రోజు వందల ట్రిప్పులు మట్టిని తరలిస్తున్నారు. లే అవుట్లకు, ఇళ్ల నిర్మాణానికి మట్టిని తవ్వి అమ్ముకుంటున్నారు. దీనిపై డిప్యూటీ తహసీల్దారు చంద్రమోహన్‌రావును విచారించగా మట్టి తవ్వే విషయం తమ దృష్టికి రాలేదన్నారు. రెవెన్యూ సిబ్బందిని పంపి, మట్టి తరలించేవారిపై చర్యలు తీసుకుంటామని అన్నారు. అనుమతులు లేకుండా తవ్వుతున్న వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు.


ఎక్స్‌కవేటర్ సాయంతో మట్టిని తవ్వుతున్న దృశ్యం




గుంతకల్లులో ఎమ్మెల్యే గుమ్మనూరు, వెంకటశివుడు యాదవ్, ఉడేగోళంలో విప్ కాలవ, తాడిపత్రిలో ఎమ్మెల్యే అశ్మిత్‌రెడ్డి పింఛన్ల పంపిణీ

కొత్త పింఛన్ల పంపిణీ

గుత్తి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అర్హులైన వితంతువులకు ఈ నెల నుంచి కొత్తగా పింఛన్లను మంజూరు చేసింది. పట్టణంలోని నూతన లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ శుక్రవారం ఉదయం పింఛన్లు అందజేశారు. అనంతరం మున్సిపల్ పరిధిలోని 17, 18వ వార్డుల్లో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తనయుడు గుమ్మనూరు ఈశ్వర్, మున్సిపల్ కమిషనర్ జబ్బర్ మీయా, మేనేజర్ రాం బాబు, పట్టణ అధ్యక్షుడు ఎంకే చౌదరి, ప్రధాన కార్యదర్శి ప్రసాద్, మండల కన్వీనర్ బద్రివలి, నాయకులు చికెన్ శ్రీనివాసులు, కేశవనాయుడు, టైలర్‌బాష, హెచ్ ఎం రసూల్, న్యాయవాది సో మశేఖర్, సునీత, శ్రీదేవి, కల్యాణి పాల్గొన్నారు.

● రాయదుర్గంరూరల్ : మండలంలోని 74 ఉడేగోళంలో ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు లబ్ధిదారుల ఇంటింటికి వెళ్లి పింఛన్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కొండన్న, టీడీపీ నాయకులు విజయ్‌కుమార్, శివానంద, ఓబయ్య, పృథ్వీ పాల్గొన్నారు.

● తాడిపత్రి : స్థానిక భగత్‌సింగ్‌నగర్‌లో పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి చేపట్టారు. అనంతరం స్థానిక హరిజనవాడ, అంబేద్కర్‌నగర్ తదితర ప్రాంతాల్లో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మల్లికార్జున, విజయ్‌కుమార్, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

● గుంతకల్లు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన వితంతు పింఛన్లను టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణస్వామి ఆధ్వర్యంలో పంపిణీచేశారు. ఇందులో టీడీపీ నాయకులు బండారు ఆనంద్, బీఎస్ కృష్ణారెడ్డి, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, పాల మల్లికార్జున, హనుమంతు, గుణశేఖర్ పాల్గొన్నారు.

● గుంతకల్లుటౌన్ : పట్టణంలో 20వ వార్డులో టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి, వార్డు కౌన్సిలర్ ఆర్ పవన్‌కుమార్ గౌడ్ ముగ్గురు వితంతువులకు కొత్తగా మంజూరైన పింఛన్లను అందజేశారు. అలాగే 9వ వార్డులో మాజీ కౌన్సిలర్ లక్ష్మీనారాయణ ఇద్దరికి నూతన పింఛన్ అందజేశారు.

● విడపనకల్లు : మండలంలో 127 మందికి కొత్తగా పింఛన్లు మంజూరైనట్లు ఎంపీడీఓ షకీలా బేగం తెలిపారు.

● బొమ్మనహాళ్ : మండలంలో కొత్తగా 112 మంది వితంతువులకు మంజూరైన పింఛన్లు అందజేసినట్లు ఎంపీడీఓ విజయభాస్కర్ తెలిపారు. ఉంతకల్లు, శ్రీధరఘట్ట, ఉద్దేహాళ్ తదితర గ్రామాల్లో టీడీపీ కన్వీనర్ బలరాంరెడ్డి, సింగల్ విండో ఛైర్మన్ కొత్తపల్లి మల్లికార్జున, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ హీరోజిరావు వాటిని పంపిణీ చేశారు.

● ఉరవకొండ : నియోజకవర్గంలోని వజ్రకరూరు, ఉరవకొండలో కొత్తగా మంజూరైన వితంతువు పింఛన్లను ఎంపీడీఓ దామోదర్ రెడ్డి, టీడీపీ నాయకులు నాగేంద్ర, నాగన్న శుక్రవారం పంపిణీ చేశారు. గడేహోతూరులో టీడీపీ నాయకులు బ్యాళ్ల ఈశ్వరయ్య, వన్నూరుస్వామి పింఛన్లు పంపిణీ చేశారు.

● బెళుగుప్ప : మండలంలోని 94 మందికి కొత్తగా వితంతు పింఛన్ల మంజూరయ్యాయి. టీడీపీ జిల్లా కార్యదర్శి మల్లికార్జున నాయకులు, శ్రీరంగాపురంలో ఎంపీడీఓ లబ్దిదారులకు పంపిణీ చేశారు.

● కణేకల్లు : మండలంలో కొత్తగా 121 మందికి పింఛన్లు మంజూరయ్యాయి. కణేకల్లులో కన్వీనర్ లాలెప్ప, ఆనంద్‌రాజ్, బీటీ రమేష్, షేక్ ముజ్జు, అనిల్, చాంద్‌బాషా, కురుబ నాగరాజు, మహ్మద్, మాల్యంలో ప్రభాకర్, శరభనగౌడ్, హరి, సూరి, మాబుసాబ్, చంద్ర, వంద్ర వాటిని పంపిణీ చేశారు.

● గుమ్మఘట్ట : కలుగోడులో కొత్త పింఛన్‌దారులకు బీటీ ప్రాజెక్ట్ ఛైర్మన్ కాలవ రాజు, సింగల్ విండో ఛైర్మన్ నీరగంటి తిమ్మప్ప, క్లస్టర్ ఇన్‌చార్జ్ కాలవ సన్నన్న డబ్బులు అందజేశారు.

● కూడేరు : మండలంలో 108 మందికి కొత్తగా వితంతు పింఛన్లు మంజూరైనట్లు ఎంపీడీఓ కుళ్లాయిస్వామి పేర్కొన్నారు. అన్ని గ్రామాల్లో సచివాలయ ఉద్యోగులు, టీడీపీ నాయకులు పింఛన్లు పంపిణీ చేశారు.

వైభవంగా సామూహిక వరలక్ష్మి వ్రతం

గుంతకల్లుటౌన్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక పరిటాల శ్రీరాముల కల్యాణ మండపంలో శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని కమ్మ సేవా సంఘం ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మి వ్రతాన్ని నిర్వహించారు. అర్చకుడు శ్రీకాంత్ శర్మ ఆధ్వర్యంలో మహిళలతో అమ్మవారి అష్టోత్తర శతనామ పూజలు నిర్వహించారు. ఈ వ్రతంలో 300 మంది మహిళలు పాల్గొన్నారు. అనంతరం మహిళలకు అమ్మవారి విగ్రహం, తీర్థప్రసాదాలను అందజేశారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమ్మసేవా సంఘం అధ్యక్షుడు డాక్టర్ రామ్మూర్తి, కార్యదర్శి గుండా దామోదర్, కోశాధికారి సీ వెంకటరమణ, సభ్యులు పాల్గొన్నారు.



సామూహిక వరలక్ష్మి వ్రతంలో పాల్గొన్న మహిళలు, అలంకరణలో అమ్మవారు

నీటి విడుదల


పూజలు నిర్వహిస్తున్న రైతులు, టీడీపీ నాయకులు

విడపనకల్లు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొమ్మిది గ్రామాలకు తాగు నీరు అందించే ఎస్ఎస్ ట్యాంక్‌కు తాగునీటిని మండల టీడీపీ నాయకులు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు శుక్రవారం విడుదల చేశారు. జీబీసీకి తాగునీరు రావటంతో గంగ పూజలు నిర్వహించి కాలువ నుంచి నాలుగు మోటార్ల ద్వారా పంపింగ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు తిప్పారెడ్డి, తిమ్మరాజు, జనార్దననాయుడు, చంద్రశేఖర్, మండల నాయకులు సినిమా రామాంజినేయులు, టీడీపీ సీనియర్ నాయకుడు హనుమంతు, పరమేశప్ప, పాఠశాలకమిటి ఛైర్మన్ శీన, ఏఈ ముజామిల్ సిబ్బంది పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలపై రైతుల ఆందోళన


ఫర్టిలైజర్ షాపు ఎదుట రైతుల ఆందోళన

కళ్యాణదుర్గం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): నకిలీ విత్తనాలతో తమను నట్టేట ముంచారని రైతులు పట్టణంలోని ఓ ఫర్టిలైజర్ షాపు ఎదుట శుక్రవారం ఆందోళనకు దిగారు. ఆ దుకాణ యజమాని పత్తి, సజ్జ, మొక్కజొన్న విత్తనాలతో పాటు పురుగుల మందులు, దిగుబడి మందులు ఇలా పలు రకాల మందులను రైతులకు అంటగట్టాడు. ఒక్కొక్క రైతు సుమారు రూ.70 వేల దాకా వసూరు చేశాడు. 50 రోజులు పూర్తవుతున్నా ఏ మాత్రం పంట ఎదుగుదల లేకపోవడంతో రైతులు ఆ ఫర్టిలైజర్ షాపు యజమానిని కొన్ని రోజులుగా నిలదీశారు. శుక్రవారం దాదాపు 20 మంది రైతులు ఆ ఫర్టిలైజర్ షాపు ఎదుట బైఠాయించారు. ఏడీఏ ఎల్లప్పకు సమాచారం ఇచ్చారు. వెంటనే ఏడీఏ ఆ ఫర్టిలైజర్ షాపు దగ్గరకు వెళ్లి రైతులతో పూర్తి వివరాలు సేకరించారు. విచారించి చర్యలు తీసుకుంటానని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు.

విధుల్లో చేరిన జీఆర్పీ డీఎస్పీ


శ్రీనివాస ఆచారి

గుంతకల్లు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): గుంతకల్లు (రాష్ట్ర) ప్రభుత్వ రైల్వే పోలీసు (జీఆర్పీ) డీఎస్పీగా కే శ్రీనివాస ఆచారి శుక్రవారం రాత్రి విధుల్లో చేరారు. స్థానిక జీఆర్పీ సబ్ డివిజనల్ కార్యాలయానికి వచ్చిన డీఎస్పీకి స్థానిక ఎస్ఐ మహేంద్ర, సిబ్బంది స్వాగతం పలికారు. కే శ్రీనివాస ఆచారి కర్నూలు పోలీసు విభాగం నుంచి గుంతకల్లు జీఆర్పీకి బదిలీపై వచ్చారు.


సురేష్


వన్నూరుస్వామి


ఉప్పర వినోద్


వన్నూరుస్వామి


హరిజన ప్రదీప్


హరికృష్ణ


బిందు


తిలక్


మనోజ్


విశాల

కానిస్టేబుళ్లుగా పలువురి ఎంపిక

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్ : కణేకల్లు మండలంలో బెణెకల్లు గ్రామానికి చెందిన కురుబ సురేష్, బ్రహ్మసముద్రంలోని ఎస్సీకాలనీకి చెందిన వన్నూరుస్వామి కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించారు. బొమ్మనహాళ్ మండలంలోని శ్రీధరఘట్ట గ్రామంలో వ్యవసాయ కూలీలు కురుబ అజ్జప్ప కుమారుడు కురుబ వన్నూరుస్వామి, ఉప్పర ఆంజనేయులు కుమారుడు ఉప్పర వినోద్ కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు. అలాగే శెట్టూరు మండలంలోని లక్ష్మంపల్లి గ్రామానికి చెందిన హరిజన ప్రదీప్, యాడికి మండలం రాయలచెరువుకు చెందిన హరికృష్ణ, బెళుగుప్ప మండలంలోని కాలువ పల్లికి చెందిన తిలక్, గుండ్లపల్లెకు చెందిన బిందు, వీరాంజనేయ కొట్టాలకు చెందిన మనోజ్, కళ్యాణదుర్గం మండలం మంగళకుంట గ్రామానికి చెందిన బి విశాల కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు.

న్యూస్ బాక్స్

పింఛన్ కోసం రచ్చకట్ట వద్దకు రావాల్సిందే


కొళగానహళ్లిలో రచ్చకట్ట వద్ద పింఛన్ పంపిణీ చేస్తున్న సిబ్బంది

బొమ్మనహాళ్ ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): సచివాలయ సిబ్బంది ఇంటింటికి వెళ్లి పింఛన్ పంపిణీ చేసేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అయితే మండలంలో కొందరు సిబ్బంది ఇంటింటికి వెళ్లకుండా రచ్చకట్ట, దేవాలయాలు వద్దకే పింఛన్‌దారులను రప్పించుకొని.. స్థానిక నాయకుల చేతులు మీదుగా పింఛన్ పంపిణీ చేశారు. దీంతో వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

5న పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్లు

గుంతకల్లు టౌన్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పలు కోర్సుల్లో ఖాళీల భర్తీకి మంగళవారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రమణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 70759 32669ను సంప్రదించాలన్నారు.

పంటల బీమా గడువు పెంపు

పుట్లూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో సాగుచేసిన పంటలకు బీమా గడువును ఈ నెల 15వ తేదీ వరకు పొడిగించినట్లు మండల వ్యవసాయాధికారి కాత్యాయిని శుక్రవారం తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆర్టీసీలో దినసరి డ్రైవర్లుగా అవకాశం

గుంతకల్లుటౌన్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): గుంతకల్లు ఆర్టీసీ డిపోలో దినసరి వేతనంతో డ్రైవర్లుగా పనిచేయుటకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని డిపో మేనేజర్ కేవీ గంగాధర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు తమ డ్రైవింగ్ లైసెన్సు, ఆధార్ కార్డు ఆర్టీఓ నుంచి లైసెన్సు క్లియరెన్స్ సర్టిఫికేట్‌ను రెండు పాస్ పోర్టు సైజ్ ఫొటోలతో గుంతకల్లు డిపో మేనేజర్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

తాడిపత్రి విద్యార్థినికి మెక్స్ స్కాలర్‌షిప్


భానురేఖ

తాడిపత్రి, ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): తాడిపత్రి విద్యార్థి వద్ది భానురేఖ మెక్స్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు తల్లిదండ్రులు వద్ది మోహన్, జ్యోత్స్న శుక్రవారం తెలిపారు. తమ కుమార్తె పదో తరగతి వరకు తాడిపత్రి అరవింద ఆశ్రమంలో, ఇంటర్ ఏపీఆర్‌జేసీ బనవాసిలో, తెలంగాణా జైశంకర్ యూనివర్శిటీలో డిగ్రీ పూర్తి చేసిందన్నారు. విక్రశాట్‌లో ఇంటర్‌షిప్ చేసి అగ్రికల్చర్ (ఎంటమాలజీ) పూర్తిచేసి జపాన్ మెక్స్ స్కాలర్ షిప్ (స్పాన్సర్‌షిప్)లో ఒకాడియా యూనివర్శిటీకి ఎంపికైనట్లు తెలిపారు.

మార్కెట్‌యార్డును అభివృద్ధి చేయండి

రాయదుర్గం రూరల్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మార్కెట్‌యార్డ్ అభివృద్ధికి కృషి చేయాలని అధికారులకు, కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు సూచించారు. స్థానిక మార్కెట్ యార్డ్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. చింతపండు రైతులు దళారుల చేతిలో మోసపోకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. మినీ టమోటా మార్కెట్ ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రూ. 1.01 కోట్లతో మార్కెట్‌లో 10 షాపింగ్ కాంప్లెక్స్‌లు, రైతుల విశ్రాంతి భవనం, సామూహిక మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యాలు కల్పించామన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డ్ అధ్యక్షుడు హనుమంతరెడ్డి, కార్యదర్శి శ్రీనివాసులు, వైస్ ఛైర్మన్ దానవేంద్ర పాల్గొన్నారు.

విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలి

రాయదుర్గం రూరల్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రైవేటు పాఠశాలల్లో విద్యాహక్కు చట్టం సక్రమంగా అమలయ్యేలా ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఆప్ జిల్లా కన్వీనర్ బీ వెంకటరమణబాబు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ చట్టం ప్రకారం ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలో 25 శాతం సీట్లను పేద, అనాథ, ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు కేటాయించాలని, కాని దీన్ని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని అన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలని వినతి

కుందుర్పి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నుంచి బెంగళూరుకు తెల్లవారుజామున బస్సు సౌకర్యం కల్పించాలని పావగడ ఎమ్మెల్యే వెంకటేశులును టీడీపీ నాయకులు, గ్రామస్థులు శుక్రవారం విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కర్ణాటకలో వైఎన్‌హెచ్ కోటలో ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే త్వరలో బస్సుసౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు.

కేటీఎస్‌లో శక్తియాప్‌పై అవగాహన

రాయదుర్గం రూరల్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో శక్తియాప్‌పై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ, వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాసులు, మహిళా సాధికారత విభాగం సమన్వయకర్త పరీషాఫిర్దోస్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డీ నారాయణ పాల్గొన్నారు.

వైసీపీ నాయకుడి జూద గృహంపై పోలీసుల దాడి

ఉరవకొండ, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ఓ వైసీపీ ప్రజాప్రతినిధి నివాసగృహాల మధ్య జూదం శిబిరాన్ని మూడు నెలలుగా నిర్వహిస్తుండటం చర్చాంశనీయంగా మారింది. అతను కొన్ని రోజులుగా కొలిమి లేఅవుట్‌లోని జగనన్న కాలనీలో ఓ ఇంట్లోని పై అంతస్థులో పేకాట నిర్వహిస్తున్నారు. ఆ గృహం వద్ద మహిళలను కాపలాగా ఉంచి పేకాట నిర్వహించడం గమనార్హం. జూద గృహం నిర్వహణ వల్ల ఇబ్బంది పడుతున్న స్థానికులు ఎట్టకేలకు గురువారం రాత్రి డయల్ 100కు ఫోన్ చేసి సమాచారమిచ్చారు. అక్కడకు వెళ్లిన పోలీసులు ఎవరూ లేరని, ఫొటోలు దిగి, చేతులు దులుపుకున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు నుంచి సెల్‌ఫోన్‌లు లాక్కొని, వెళ్లిపోయినట్లు సమాచారం. పేకాట నిర్వహిస్తున్న వైసీపీ నాయకుడిని వదిలివేయడం వెనుక పోలీసుల ప్రమేయం ఉన్నట్లు, ఆ శాఖలోని సిబ్బందే గుసగుసలాడుతున్నారు. ఈ విషయంపై సీఐ మహానందిని వివరణ కోరగా అనుమానం ఉన్న వ్యక్తుల నుంచి ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నామన్నారు. పేకాట శిబిరం నిర్వహించిన వైసీపీ నాయకుడు వన్నప్పతో పాటు మరో ఐదుగురిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.21వేలు నగదు, మూడు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రైల్వే ఉద్యోగి ఇంట్లో చోరీ

రాయదుర్గం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వేక్వార్టర్స్‌లో నివాసం ఉంటున్న రైల్వే ఉద్యోగి నాగేంద్ర ఇంట్లో శుక్రవారం తెల్లవారుజామున గుర్తు తెలియని దుండగులు బంగారు, వెండి నగలు, నగదును చోరీ చేశారు. బాధితుడు నాగేంద్ర తెలిపిన వివరాల మేరకు.. రైల్వేస్టేషన్ పరిధిలో ఇటీవల నిర్మించిన కొత్త క్వార్టర్స్‌కు గురువారం రాత్రి మకాం మార్చారు. ఇంకా మార్చాల్సిన సామన్లు ఉండటంతో కొత్త ఇంట్లో సామాన్లు ఉంచి రాత్రి తాళాలు వేసుకుని వచ్చారు. గుర్తు తెలియని దుండగులు రైల్వేక్వార్టర్స్‌లోని ఆ ఇంటి తాళాలు పగులగొట్టి సూట్‌కేసులో దాచిన సుమారు నాలుగు తులాల బంగారం నగలు, 15 తులాల వెండి నగలు, రూ. 2వేల నగదు దోచుకెళ్లినట్లు తెలిపారు. శుక్రవారం ఉదయం వాకింగ్‌కు వెళ్లినవారు గమనించి రైల్వే అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో నాగేంద్ర స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

క్రైం న్యూస్ ..

వివాహం కాలేదని యువకుడి ఆత్మహత్య

గుమ్మఘట్ట, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగసముద్రం గ్రామానికి చెందిన హరిజన రాజకుమార్ (27) పెళ్లి కాకపోవడంతో జీవితంపై విరక్తి చెందాడు. గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు అతన్ని వెంటనే అనంతపురం ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. కోలుకోలేక అతను శుక్రవారం ఉదయం మరణించినట్లు ఎస్ఐ ఈశ్వరయ్య తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

బళ్లారిరూరల్ (కర్ణాటక), ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని బళ్లారి తాలూకా పరిధి పరమదేవనహళ్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వజ్రకరూరు మండలం కొనకొండ్ల గ్రామానికి చెందిన కంసల అశోక్ మరణించాడు. ఇతను గుంతకల్లు నుంచి బళ్లారికి కారులో వెళ్తుండగా.. లారీ ఢీకొంది. తీవ్రంగా గాయపడ్డ అశోక్‌ను బళ్లారి విమ్స్ ఆస్పత్రికి తరలించారు. విమ్స్‌లో చికిత్స పొందుతూ అశోక్ మరణించాడు. పీడీ హళ్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కేసు నమోదు

పుట్లూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని మడ్డిపల్లి గ్రామంలో రెండు రోజుల క్రితం ఐదుగురు రైతులకు చెందిన 140 మీటర్ల విద్యుత్ కేబుల్‌ను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసిన విషయం విదితమే. దీనిపై శుక్రవారం కేసు నమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డుకు మరమ్మతు


రాయలచెరువులో రోడ్డుకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

యాడికి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయలచెరువులో రైల్వేస్టేషన్ రోడ్డుకు అధికారులు శుక్రవారం మరమ్మతు పనులను చేపట్టారు. పంచాయతీరాజ్ డీఈ యల్లమనాయుడు, జేఈ వరప్రసాద్‌లు మాట్లాడుతూ.. వర్షం వస్తే నీరు నిల్వ ఉండకుండా ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి ఆదేశాల మేరకు రోడ్లపై గుంతలను మట్టితో పూడ్చివేయించామన్నారు. అలాగే రూ.10 లక్షలతో యాడికిలో మార్కెట్‌కు వెళ్లే రోడ్డు పనులను త్వరలో చేపడతామన్నారు. యాడికిలోని మార్కెట్ రోడ్డు, రాయలచెరువు రైల్వేస్టేషన్ రోడ్డులకు గతంలో సిమెంట్‌రోడ్లు వేశామని, నీటి కొళాయిల ఏర్పాటు కోసం గుంతలు తవ్వడం, ఆ గుంతలపై కాంక్రీట్ వేయకపోవడంతో ఆ దారులు దెబ్బతిన్నాయని అన్నారు. అంతేకాకుండా ఆయా రోడ్లకు ఇరువైపులా ఉన్నవారు వర్షపునీరు తమ పరిసరాల్లోకి రాకూడదని మట్టిని వేసుకోవడంతో ఆ రోడ్లపై నీరు నిల్వ ఉంటోందన్నారు.

గ్రామదేవతకు గంగపూజ


గ్రామ దేవతకు గంగపూజ నిర్వహిస్తున్న భక్తులు

కుందుర్పి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని కరిగానపల్లి గ్రామంలో గ్రామదేవత విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. శుక్రవారం గ్రామ చివర పొలంలో అమ్మవారి విగ్రహాన్ని ఉంచి గంగపూజ నిర్వహించారు. అనంతరం అమ్మవారి విగ్రహాన్ని మేళతాళాలతో గ్రామంలో ఊరేగించారు. గుడిలో విగ్రహాన్ని ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్నట్లు ఆ గ్రామపెద్దలు తెలిపారు.

నవ అహోబిల నరసింహస్వామికి కల్యాణం



గుత్తిరూరల్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపేటలో నవ అహోబిల నరసింహస్వామికి శుక్రవారం ఘనంగా కల్యాణం నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీదేవి భూదేవి నరసింహస్వామి ఉత్సవ విగ్రహాలకు కల్యాణం నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ మూర్తులను పల్లకిలో ఊరేగించారు.

న్యాయం చేయాలని నిరసన

తాడిపత్రి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఇంటి విషయంలో తనకు న్యాయం చేయాలని స్వర్ణలత తన కుమారుడితో కలిసి రోడ్డుపై బైఠాయించి శుక్రవారం నిరసన తెలిపారు. మూడేళ్ల క్రితం సుంకులమ్మపాలెంకు చెందిన అన్నదమ్ములు ప్రతాప్, విజయ్ నుంచి రూ. 35 లక్షలకు ఓ ఇంటిని కొనుగోలు చేసింది. అయితే తాము ఆ ఇంట్లోనే ఉంటూ బాడుగ ఇస్తామని ఆ అన్నదమ్ములు నమ్మబలికారు. అయితే బాడుగ ఇవ్వకుండా.. ఇళ్లు ఖాళీ చేయకపోవడంతో స్వర్ణలత వారి ప్రశ్నించింది. దీంతో వారు ఆమెకు ఏకంగా కోర్టు నోటీసులు పంపించారు. ఆగ్రహించిన ఆమె శుక్రవారం తన కుమారుడితో కలిసి.. ఆ ఇంటి ఎదుట రోడ్డుపై బైఠాయించింది. విషయం తెలుసుకున్న పట్టణ సీఐ సాయిప్రసాద్ అక్కడకు చేరుకొని వారితో మాట్లాడారు. అన్నదమ్ముల వద్దే తప్పు ఉన్నట్లు గుర్తించారు. తమకు కొంత వ్యవధి కావాలని, డబ్బులు వెనక్కు ఇచ్చి తమ ఇంటిని తామే తీసుకుంటామని అన్నదమ్ములు తెలపడంతో స్వర్ణలత నిరసన విరమించుకున్నారు.

ఎస్ఐకి ఎస్పీ అభినందన


ఎస్ఐను అభినందిస్తున్న ఎస్పీ

కణేకల్లు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): సైబర్‌క్రైమ్ చేధింపులో ప్రతిభ చూపిన కణేకల్లు ఎస్ఐ నాగమధును ఎస్పీ జగదీష్ శుక్రవారం అభినందించారు. రాయదుర్గం మండలం వేపరాల గ్రామానికి చెందిన ఓ వ్యక్తి సైబర్‌క్రైమ్ నేరగాళ్ల వలలో పడి రూ. 1.74 కోట్లు పోగొట్టుకున్నాడు. ఆ వ్యక్తి కణేకల్లు వాసి కాగా వేపరాలలో ఉంటున్నాడు. దీంతో ఈ కేసు చేధింపులో రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణతో కలిసి నాగమధు దాదాపు 15 రోజుల పాటు పలు రాష్ట్రాల్లో తిరిగి నిందితులను పట్టుకుని రూ. 42 లక్షల దాకా రికవరీ చేశారు. ఇందులో ప్రతిభ చూపిన ఎస్ఐని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.